ప్రజాశక్తి

గురువారం 30 అక్టోబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



తుళ్లూరు మండలంలో తడిసిన పత్తి కాయలు



కొల్లిపర మండలంలో ఒరిగిన వరి

ముంచెత్తిన మొంథా



మాచర్ల పట్టణం నెహ్రూనగర్‌లో మునిగిన ఇళ్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మొథా తుపాన్ బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. హోరెత్తిన గాలితో జిల్లాలో భారీ చెట్లు నెలకొరిగాయి. పొలాల్లో పైర్లు నేలవాలాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కుండపోతగా వర్షం కురిసి పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 200 మిల్లీ మీటర్ల వర్షం కురవగా గుంటూరు జిల్లా కాకుమానులో 116 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

గుంటూరులో లక్ష ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. దాదాపు 70 వేల ఎకరాల్లో వరి, 20 వేల ఎకరాల్లో పత్తి, మరో 10 వేల ఎకరాల్లో ఇతర పంటలు నీట మునిగాయి. గాలులు కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. వర్షం, గాలి ఏకం కావడంతో పొలాల్లో నీరు చేరి నేలవాలిన వరికంకులు నీట మునిగి వరి కంకులు తడిసి గింజ రాలిపోవడం, రంగుమారడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే బుధవారం రాత్రి, గురువారం వర్షం కురవకపోతే దాదాపు 50 శాతం విస్తీర్ణంలో పంటలు నష్టం నుంచి బయటపడతాయని వ్యవసాయ శాఖ గుంటూరు జిల్లా అధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. పల్నాడు జిల్లాలో మరో 40 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా. ప్రధానంగా వరి, పత్తి, మిర్చి, కంది దెబ్బతిన్నాయి. పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో వరి, పత్తి పొలాలు ముంపునకు గురయ్యాయి. వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో పైర్లు నీట మునిగాయి. పల్నాడులో వర్షం అధికంగా కురవడం వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల, వినుకొండ, శావల్యాపురం, బొల్లాపల్లి, ఈపూరు, నరసరావుపేట, కారండపూడి, పిడుగురాళ్ల పెదకూరపాడు తదితర మండలాల్లో పొలాల్లోకి నీరుచేరింది. పత్తి, మిర్చి, కంది, వరి పంటలు నీటిలో తేలియయాడుతున్నాయి.



నరసరావుపేటలో..



సత్తెనపల్లి మండలంలో..

పల్నాడు జిల్లాల్లో మంగళవారం రాత్రి 9 గంటలకు ప్రారంభమైన వర్షం బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. చిలకలూరిపేట, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలపై తుపాను ప్రభావం ఎక్కువగా ఉంది. క్రోసూరు మండలం దొడ్లేరు, గరికపాడు మధ్య చెరువుకు గండిపడింది. యడ్లపాడు మండలం తిమ్మాపురం జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచి వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చిలకలూరిపేట వద్ద కప్పగంజి వాగు ఉధృతంగా ప్రహహించి రాకపోకలకు అంతరాయం కల్గింది. కోటేళ్ల వాగు పొంగి ప్రవహించడం వల్ల రాజధాని వెలగపూడికి వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల చప్టాలపై నీరు పారడం వల్ల ▶ 2లో



చినకొండ్రుపాడు లోలెవల్ చప్టాకు గండి



మత్సకారుణ్ణి కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - బెల్లంకొండ : నదిలో చిక్కుకున్న తెలంగాణ మత్స్యకారుణ్ణి పోలీసులు రక్షించారు. మండలంలోని పులిచింతల ప్రాజెక్ట్ ముంపు గ్రామమైన పాతచిట్యాల సమీపంలో తెలంగాణ రాష్టం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన పరసాని శ్రీను చేపలవేటకు కోసం కృష్ణానదికి వచ్చాడు. బోటు రిపేర్ వచ్చి నదిమధ్యలో చిక్కుకు న్నాడు. తెలంగాణ రాష్ట్ర పోలీసుల నుండి పల్నాడు ఎస్పీ సమాచారం రావడంతో బెల్లంకొండ ఎస్ఐ డి.ప్రవీణ్ తన సిబ్బందితో కలిసి స్థానిక గజఈతగాళ్ల సాయంతో మత్స్యకారుణ్ణి ఒడ్డుకు చేర్చారు. వాహనం పోవడానికి రోడ్డు మార్గం లేకపోయినా కొండాదారిలో వెళ్లి కాపాడారు.



తాడేపల్లి ప్రాంతంలో దెబ్బతిన్న అరటితోట



వినుకొండ ప్రాంతంలో వరిగిపోయిన పైర్లు



పెదకూరపాడు మండలంలో..



పెదనందిపాడులో ట్రాక్టర్‌పై గుంటూరు కలెక్టర్..

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-తెనాలిరూరల్, పల్నాడు జిల్లా



తెనాలి మండలంలో పైర్లను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతుసంఘం డిమాండ్ చేసింది. గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని నేలపాడు, తేలప్రోలు, గోలిడొంక పొలాలను పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పాలపాడులో తుపాను ప్రభావంపై నాయకులు బుధవారం పరిశీలించారు. తెనాలి మండలంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, ఇతర నాయకులు పరిశీలించారు. ఇప్పటికే రెండు సార్లు వెద పద్ధతిలో నాట్లు వేశామని, కౌలు రూ.30 వేలు ముందుగా కౌలు చెల్లించానని తెలప్రోలు గ్రామానికి చెందిన రైతు వేజెండ్ల రోశయ్య తెలిపారు. అప్పులు తెచ్చి పొలాలకు పెట్టుబడి పెట్టుబడి పెట్టామని నేలపాడు గ్రామానికి చెందిన రైతు ఏడుకొండలు కన్నీరుమున్నీరయ్యారు. ఎరువులను అధిక ధరలకు కొనుగోలుచేసి పెట్టుబడి పెట్టామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని హయ్యర్‌పేట యువ రైతు వంపుగళ్ల సుమంత్ కోరారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పొట్టదశలో ఉన్న వరి 70 శాతం నేలకొరిగిందని, కొద్ది రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలమట్టమైందని చెప్పారు. వరి ఎకరాకు రూ.25 వేలు, పసుపు, అరటి, కూరగాయ తోటలకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని ▶ 2లో

తుపాను బాధితులందరికీ సాయం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి



పునరావాస శిబిరంలో బాధితులతో మాట్లాడుతున్న బాబూరావు

తుపాను బాధితులందలరికీ ప్రభుత్వం సహాయం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు కోరారు. తాడేపల్లి పట్టణంలోని ముగ్గురు రోడ్డు, పుష్కర కాలనీ, బోటు యార్డు తదితర పునరావాస శిబిరాలను, తుపాను ప్రభావిత ప్రాంతాలను బాబూరావుతోపాటు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, ఇతర నాయకులు బుధవారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రభుత్వం వైపు నుండి అందుతున్న సహాయ సహకారాలపై అడిగారు. ఈ సందర్భంగా పునరావాస శిబిరాల్లోని వారు పలు అంశాలను సిపిఎం నాయకులకు చెప్పారు. వర్షాల కారణంగా తమ ఇళ్లలోకి నీరు వచ్చి నివాసానికి అనుకూలంగా లేవన్నారు. కొన్ని రోజులుగా పనులు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొంతమంది తుపాను బాధితులుగా ఉన్నప్పటికీ వారు శిబిరాలలోకి వస్తే తమ ఇళ్లలో ఉండే సామానుకు భద్రత లేదని శిబిరాల్లోకి వెళ్లలేకపోయామని చెప్పారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండడంతో వాటిని తోడిపోసుకునే పనిలో ఇళ్లవద్ద వండాల్సి వచ్చిందని మరి కొంతమంది అన్నారు. మంగళగిరిలోని కొత్తపేట స్కూల్, తాడేపల్లిలోని పోలకంపాడు ప్రాథమిక పాఠశాల, తాడేపల్లి హైస్కూల్, సీతానగరం స్కూలు తదితర ▶ 2లో

జెడ్‌పి సమావేశం వాయిదా -2వ పేజీ



తుపాను బాధితులకు ఎమ్మెల్యే మాధవి భరోసా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి బుధవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం పలు పునరావస కేంద్రాలను సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. ఆహార పానియాలు అందించారు. పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలపై అధికారులతో సమన్వయం చేశారు. అన్ని డివిజన్ల నుండి తుఫాన్ ప్రభావిత పరిస్థితులు, పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సౌకర్యాల వివరాలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి అడిగి తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి నుండి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వయంగా పర్యవేక్షిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు గళ్ళా మాధవి ఆదేశాలు జారీ చేశారు. విరిగిన చెట్ల తొలగింపు, విద్యుత్ లోపాల సవరణ, పునరుద్ధరణ పనులు వేగవం టతంగా చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. శ్రీనివాసరావు పేట పీకలవాగు కట్ట వద్ద టిడిపి నాయకులు సుభాని సుమారు 500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.



ఆలపాటి నగర్‌లో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక సుల్తానాబాద్ ఆలపాటి నగర్‌లో బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పర్యటించారు. భారీ వర్షాల అనంతర పరిణామాలను తెలుసుకొనేందుకు పర్యటించిన సందర్భంగా స్థానిక మహిళలు ఆ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వద్ద ఏకరువు పెట్టారు. రోడ్లు సరిలేవని, సైడ్ కాలువలు లేవని, వీధిలైట్లు వెలగటం లేదని చెప్పారు. దాదాపు 10 ఏళ్లగా సమస్యలు ఎదుర్కొంటున్నామని, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని వాపోయారు. దీనిపై ఆలపాటి స్పందిస్తూ ప్రతిపాదనలు ఉన్నాయని, సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

ప్రజాశక్తి-గుంటూరు

మొంథా తుపాన్‌ను సమర్ధంవంతంగా ఎదుర్కొన్నామని, నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు ప్రణాళికాబద్ధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూశామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మేయర్, కమిషనర్ రామాంజనేయపేట, ఇన్నర్ రింగ్‌రోడ్, శ్రీకృష్ణదేవరాయనగర్, తుపాన్ నగర్‌లను పరిశీలించి, తదుపరి చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మేయర్ మాట్లాడుతూ తుఫాన్‌ని ఎదుర్కోవడానికి జిఎంసి ఆధ్వర్యంలో విస్తృత చర్యలు తీసుకున్నామన్నారు. ప్రధానంగా అధికారులు, సచివాలయ కార్యదర్శులు తమకు కేటాయించిన విధుల్లో నూరు శాతం ఉన్నారని, వారికి తోడ్పాటుగా కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు కూడా నిలిచారన్నారు. పునరావాస కేంద్రాల్లో కూడా ఏలోపం లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ముందస్తుగా కచ్చా డ్రైన్ల ఏర్పాటు, మేజర్ డ్రైన్లలో పూడికతీత చేపట్టడం వలన పలు కాలనీలు ముంపు బారిన పడలేదన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు పంపి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. తుపాన్ నగర్ లో ప్రజలను పునరావాస కేంద్రాలకు పంపడంతో పాటు సదరు ప్రాంతంలో నిలిచిన నీటిని మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయించామని తెలిపారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా జిఎంసి కమాండ్ కంట్రోల్ రూమ్ 0863 2345103 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. పర్యటనలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డిఈఈ శ్రీనివాస్, నోడల్ అధికారులు, వివిధ డివిజన్ల కార్పోరేటర్లు, అధికాలరు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జెడ్‌పి సమావేశం వాయిదా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మీడియాతో మాట్లాడుతున్న వైసిపి జెడ్పిటిసిలు ఓబుల్ రెడ్డి తదితరులు

జిల్లా పరిషత్ సమావేశానికి కోరం లేకపోవడంతో మంగళవారం జరిగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మొత్తం 57 మంది జెడ్‌పిటిసిలు, మరో 27 మంది ప్రజా ప్రతినిధులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఏడుగురు జెడ్‌పిటిసిలు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాత్రమే హాజరయ్యారు. కోరం ఉండాలంటే 27 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా 8 మందే హాజరుకావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా ప్రకటించారు. సమావేశం అనంతరం వైసిపి పక్షం నాయకుడు పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో తిరిగి సమావేశం నిర్వహించాలని కోరారు. తుపాను ప్రభావం వల్ల అధికారులు వివిధ మండలాల్లో బిజిగా ఉన్నారని, పజా ప్రతినిధులు కూడా క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండటం వల్ల సమావేశానికి రాలేకపోయారని అన్నారు.

ముంచెత్తిన మొంథా

(మొదటి పేజీ తరువాయి)

వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల, వినుకొండ, నర్సరావుపేట పట్టణాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు. నరసరావుపేట బరంపేట వద్ద వర్షం నీరు నిలిచి బైపాస్ వద్ద భారీ ప్రవాహం రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కోడెల శివ ప్రసాదరావు బ్రిడ్జిపై నీరు నిలిచింది. ములకలూరు ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. నరసరావుపేట-చిలకలూరిపేట రహదారిపై నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్ పాలెం వద్ద పొంగి కొండ వాగు పొంగి ప్రవహిచింది. చిలకలూరిపేట - నరసరావుపేట రహదారిపై నీరు నిలిచింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు వద్ద రహదారిపై నీరు ప్రవాహం ఉండటంతో బేతపూడి వాగు వద్ద, చప్ట వద్ద వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. గుంటూరు రూరల్ మండలం గోర్లవారిపాలెం వద్ద కొండవీటి వాగు నీటి ప్రవాహం ఉధృతిగా ప్రవహించి తాడికొండ-గుంటూరు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అడ్డరోడ్డు వద్ద వర్షం నీరు నిలిచింది. పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం వద్ద వర్షం నీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రమాదాలు జరగకుండా బారికెడ్లు ఏర్పాటు చేశారు. మేడికొండూరు మండలం వై.వి.ఆర్.ఎస్.సి కాలనీ వద్ద చప్టాపై వాగు నీరు ప్రవాహంతో రాకపోకలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. తెనాలి - మంగళగిరి రహదారిలో సోమసుందరపాలెం వద్ద చెట్టు కూలగా అధికారులు వెంటనే తొలగింపజేశారు. ఆలూరు వద్ద పడిపోయిన చెట్లను తొలగించారు. దుగ్గిరాల మండలం కరకట్ట - వీరలపాలెం , పెద్ద కిండూరు, పెరుకలపూడి గ్రామాల వద్ద మంగళవారం రాత్రి చెట్లు కూలాయి. దొప్పలపూడి వద్ద కూలిన చెట్టును వెంటనే తొలగించారు.

తుపాను అనంతరం పరిస్థితులను సమీక్షించేందుకు గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లారు. విద్యుత్ అంతరాయంతో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. పారిశుధ్యం లోపం లేకుండా చూడాలని ఆదేశించారు. ఎక్కడా నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించాలని, కాజ్‌వేల వద్ద నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విద్యుత్‌ను త్వరగా పునరుద్ధరించాలని, రహదారులపై చెట్లు పడిపోయిఉంటే తొలగింపు వేగవంతం చేయాలని చెప్పారు. గుంటూరు జాయింట్ కలెక్టర్ శ్రీవాస్తవ, పల్నాడు జెసి సూరజ్ పలు మండలాల్లో పర్యటించారు.

వివిధ మండలాల్లో వర్షపాతం నమోదు వివరాలు (మిల్లీ మీటర్లలో)

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
కాకుమాను	116.6	నరసరావుపేట	105.0
ప్రత్తిపాడు	109.4	పిడుగురాళ్ల	100.0
పెదనందిపాడు	114.6	నూజెండ్ల	98.8
పొన్నూరు	58.0	పెదకూరపాడు	98.4
గుంటూరు తూర్పు	56.0	వినుకొండ	96.8
గుంటూరు పశ్చిమ	68.8	ఈపూరు	96.4
చేబ్రోలు	91.4	వెల్దుర్తి	87.2
కొల్లిపర	78.4	దుర్గి	78.2
తుళ్లూరు	62.2	బెల్లంకొండ	77.2
పెదకాకాని	66.2	గురజాల	77.2
తాడికొండ	64.6	అమరావతి	70.4
ఫిరంగిపురం	63.8	మాచవరం	69.8
వట్టిచెరుకూరు	76.2	క్రోసూరు	69.0
దుగ్గిరాల	74.6	మాచర్ల	68.8
తాడేపల్లి	74.2	రాజుపాలెం	67.4
తెనాలి	60.9	ముప్పాళ్ల	66.4
మేడికొండూరు	60.9	రొంపిచర్ల	62.4
మంగళగిరి	60.0	రెంటచింతల	50.2
చిలకలూరిపేట	209.4	అచ్చంపేట	48.8
నాదెండ్ల	162.4	నకరికల్లు	43.6
యడ్లపాడు	154.8	సత్తెనపల్లి	61.8
శావల్యాపురం	118.8	దాచేపల్లి	58.4
బొల్లాపల్లి	112.6		





తుపాను బాధితులందరికీ సాయం అందించాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

పునరావాస శిబిరాలను పుష్కర కాలనీ నివాస ప్రాంతాన్ని బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పునరావాస శిబిరాలలో తలదాచుకుంటున్న వారితోపాటు శిబిరాలలోకి రాలేకపోయినా తుపాను బాధిత పేదలందరికీ కుటుంబానికి రూ.3 వేల చొప్పున ఆర్థిక పరిహారం, నిత్యావసర సరుకులు వెంటనే అందించాలని కోరారు. ఇళ్లలోకి నీరు వచ్చిన ప్రతి కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని, ఇందుకుగాను తక్షణమే అధికారులు అంచనాలు పూర్తిచేయాలని కోరారు. రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున, పారిశుధ్య పనులు చేపట్టాలని, అధికారులను అప్రమత్తం చేయాలని అన్నారు. పరిశీలనలో సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వి.జవహర్లాల్, తాడేపల్లి పట్టణ నాయకులు డి.విజయభాస్కర్‌రెడ్డి, వై.బర్నబసు, కె.మేరీ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను సందర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

తుఫాన్ నేపథ్యంలో ముంపు ప్రాంతాలైన పాత గుంటూరు రాజీవ్ గాంధీ గ్రంథాలయం రోడ్డు, జున్ను షాహిద్ నగర్, శ్రామిక నగర్ కాలనీలలో సీపీఎం నాయకులు ప్రజలను పరామర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిరు వ్యాపారులతో మాట్లాడి కూరగాయల ధరలను విచారించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు లక్కా అరుణ కుమారి మాట్లాడుతూ తుఫాను ఇబ్బందుల నేపథ్యంలో సీఐటీయూ కార్యాలయంలో పునరావాసం ఏర్పాట్లను సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు టీ శ్రీనివాసరావు, పాత గుంటూరు శాఖ కార్యదర్శి శనగపల్లి కార్తీక్, నాయకులు సైదా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు నగరంలో 36, 38, 39, 42వ డివిజన్లలో ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రాలను సిపిఎం నగర నాయకులు సందర్శించారు. బాధితులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న భోజనం, ప్రథమ చికిత్స, మందులు, మౌలిక సదుపాయాలు, తాగునీటిరు తదితర సౌకర్యాలను పరిశీలిచారు. ఆయా డివిజన్లలోని లోతట్టు ప్రాంతాలైన శ్రీకృష్ణదేవరాయ నగర్, రైల్వే ట్రాక్, భాగ్యనగర్, తుపాన్ నగర్, కళ్యాణ్ నగర్, రైల్వే ట్రాక్, రత్నగిరి నగర్, నేతాజి నగర్, వడ్డెర కాలనీలోని ప్రజలు ఉన్న ప్రజలకు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య హైస్కూల్, రామ్‌శెట్టి రామారావు మున్సిపల్ హైస్కూల్, చిన్మయ స్కూల్‌ను నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.సత్యనారాయణ నగర కమిటీ సభ్యులు, నగర కమిటీ సభ్యులు షేక్. ఖాసింవలి, షహీద్, షేక్.బాష పాల్గొన్నారు.



తుపాను బాధితులను తక్షణమే ఆదుకోవాలి సిపిఎం

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకాని, వెనిగండ్ల, నంబూరు, ఉప్పలపాడు ప్రాంతాల్లో నాలుగు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా వీటిని సిపిఎం బృందం పరిశీలించింది. ఆ పార్టీ మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ బాధితుల్లో ఒక్కొక్కరికి 50 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం సత్వరం అందించాలన్నారు. వర్షానికి దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతుల కోసం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకూ పరిహారం ఇవ్వాలని కోరారు. 16వ .ంబర్ జాతీయ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్లు సరైన పద్ధతిలో రహదారుల నిర్మాణం చేయలేదని, జాతీయ రహదారికి ఉన్న కలవట్లు పూడ్చి వేయడం వల్ల దిగువకు నీరు వెళ్లక అనేక ప్రాంతాలు చిన్నపాటి వర్షానికి కూడా ముంపు బారిన పడుతున్నాయని చెప్పారు. పల్లాలమ్మ చెరువు నుండి కిందకి నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. శ్రీనివాసరావు, రాజా రమేష్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - తుళ్లూరు

వడ్డెర కాలనీ, ఎస్సీ కాలనీకి చెందిన 40 మంది స్థానిక కెవిఆర్ జెడ్పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉండగా సిపిఎం నాయకులు పేరం బాబురావు, పి.వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ కేంద్రాల నిర్వహణ సజావుగా సాగేందుకు సిపిఎం సహకరిస్తుందన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : రైతుసంఘం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంక రత్నం, మేకల భాస్కరరావు, రావూరి నాగగోపి, వేజెండ్ల నాగలోకయ్య, ఎం.మహేష్, పోపూరి బాబూరావు పాల్గొన్నారు. పాలపాడులో పరిశీలించిన రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వేలాది ఎకరాల్లో పొట్టకొచ్చిన వరి పైరు నేలవాలిందని, పత్తి పగిలిన కాయలు తడవటం, కుళ్లి ఎకరాకు 2-3 క్వింటాళ్ల దిగుబడి తగ్గుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే పంటల నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు. మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు, ఉద్యాన పంటలునష్టపోయిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్లో వచ్చే ధాన్యాన్ని షరతుల్లేకుండా మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. సిసిఐ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరారు. రబీ సీజన్‌కు సరిపడా ఎరువులను, విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని, పంట రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాల వల్ల యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందని, రైతులకు సరిపడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



నేల వాలిన అరటి చెట్లు

ముంపు పొలాల్లో పరిశీలన

ప్రజాశక్తి- తాడేపల్లి

ఐట, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని ఉండవల్లి లో మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాల కు ఈదురు గాలులకు వృక్షాలు పడిపోయాయి. పంటలు నీటి మునిగాయి. సమాచారం అందుకున్న గుంటూరు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి ఉండవల్లిలోని పంట పొలాలు పరిశీలించి జెసిబి సహాయంతో పొలాల్లో నిలిచిన నీటిని కొండవీటి వాగులోకి మళ్ళించారు. కార్య క్రమంలో ఉండవల్లి గ్రామ ఉపాధ్యక్షుడు సనక బుచ్చి బాబు, కునప రెడ్డి రమేష్,రైతు శివుడు,బొబ్బా రవితేజ రైతులు పాల్గొన్నారు.



ఢీకొన్న రెండు ఆటోలు

ఆటోలు ఢీ - ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - అమరావతి

ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొని ఇరువురు గాయపడిన సంఘటన మండల పరిధిలోని లింగాపురం వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో అమరావతికి చెందిన అడపాల కోటేశ్వరరావు, పెదకూరపాడుకు చెందిన ప్రవీణ్ గాయపడ్డారు. కోటేశ్వరరావు తలకు గాయకావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

అధ్వానంగా ఎస్టీ కాలనీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో తుపాన్ ప్రభావం కారణంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో దాదాపు ఎస్టీలే అధికంగా ఉన్నారు. మండలంలో మూడు పునరావాస కేంద్రాలు ఉండగా కోయవారి పాలెం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మొత్తం 40 మంది ఉండగా అందులో 35 మంది వరకు ఎస్టీలు (యానాదులు) ఉన్నారు. పత్తిపాడులోనిపునరావాస కేంద్రాల్లో కూడా 254 మంది ఎస్టీ కాలనీ వారే ఉన్నారు. వారు నివసించేది ఎక్కడో కాదు మండల ప్రభుత్వ కార్యాలయాలు ఎదురుగా అంటే కుత వేటు దూరంలోనే. అక్కడ సిమెంట్ రోడ్లు,సైడ్ కాల్వలు ఉన్నప్పటికీ కాల్వ పూడిక తీయక పోవడంతో వర్షపు నీరు పారుదల లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. ఇది ఇప్పటి సమస్య కాదు ప్రతి సారి ఇలానే జరుగుతోందని పునరావాస కేంద్రాలలో ఉన్న బాధితులు



ఎస్సీ కాలనీలో చేరిన వర్షపు నీరు

ప్రజాప్రతినిధులకు, కలెక్టర్‌కు తెలుపుతున్నారు. బుధవారం కొంతమేర పూడిక తీసి పోటోలు తీసుకొని వెళ్లారు తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజానీకం తెలుపు తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాము నివ సించే ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని ఎస్టీలు కోరుతున్నారు.

రైతులకు వ్యవసాయాధికారి సూచనలు

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు మండలంలోని మామిళ్ళపల్లి, కొండమూది, నిడుబ్రోలు, వడ్డీముక్కల, చింతలపూడి, వల్లభరావు పాలెం, గ్రామాలను మండల వ్యవసాయాధికారి ఆర్. వెంకటేశ్వరావు సందర్శించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. పడిపోయిన వరి పైరులు మొదటగా పొలంలోని వరి పైరు నాలుగు ఐదు దుబ్బులను కలిపి కట్టి నిలబెట్టి నీరు బయటికి పోయేలా చూడాలన్నారు. సుడిదోమ నివారణకు ఇథోఫెన్ ఫాక్స్ ఎకరాకు 300 మి.లీ. లేదా పైమెట్రోజన్ ఎకరాకు 120 గ్రాములు లేదా థయోమిధాక్సాన్ ఎకరాకు60 గ్రాము లు బిప్రూఫ్యుజన్ ఎకరాకు320మి.లీ పిచికారీ చేయాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్, గ్రామ వ్యవ సాయ సహా యకులువంశీ, ప్రసాద్ పాల్గొన్నారు.

వలస కూలీలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో అచ్చయ్యపాలెం గ్రామంలోని వలస కూలీలకు బుధ వారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తుఫాన్ వల్ల పనులు లేక ఇబ్బందులు పడుతున్న వలస కూలీలకు అలవాల గ్రామ టిడిపి నాయకులు వెన్నా రవీంద్రారెడ్డి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదేశాల మేరకు వలస కూలీలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని టిడిపి నాయకులు రవీంద్రారెడ్డి తెలి పారు. అలవాల గ్రామ సమీపంలో గల వంతెనకు ముళ్ళ కంచెలు అడ్డుపడ టంతో జెసిబితో తొలగించారు. ఈ కార్య క్రమంలో గ్రామ టిడిపి నాయ కులు భాషా,యలమంద, అంజిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1600 ఎకరాల్లో పత్తికి నష్టం

ప్రజాశక్తి - తుళ్లూరు

తుఫాన్ కారణంగా 1600 ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారిణి పి సంధ్యారాణి బుధవారం తెలిపారు.4,500 ఎకరాలలో పత్తి సాగవుతున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రైతులతో కలిసి ప్రాథమికంగా పంటల నష్టంపై అంచనాలను రూపొందించడం జరిగిందన్నారు. మినుము 24 హెక్టార్లు(60 ఎకరాలు), వరి 32(80 ఎకరాలు),34 హెక్టార్లలో(85 ఎకరాలు) ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఎఓ చెప్పారు.

తుపాను బాధితులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొంథా తుపాన్ కారణంగా తాడేపల్లి నులక పేట, డ్రైవర్స్ కాలనీ, రాయల్ పబ్లిక్‌స్కూల్లో, ముగ్గు రోడ్డు ఎంపియుపి స్కూల్, తాడేపల్లి కె.వి.ఆర్ జడ్పీ హైస్కూల్లో పునరావస కేంద్రా లలో ఆశ్రయం పొందుతున్న 300 మందికి సుమారు రూ.60 వేల విలువ గల దుప్పట్లు పంపిణీ బుధ వారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శకుంతల,డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ విచ్చేశారు. వారు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు ప్రజలకు సేవ చేయటం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, సెక్రటరీ ట్రెజరర్ అందే మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వం పెద్ద మనసు చేసుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - పొన్నూరు

వైసిపి పొన్నూరు నియోజకవర్గ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ బుధవారం పొన్నూరు నియోజకవర్గంలో తుపాన్ ప్రభావిత ప్రాంతా లైన పొన్నూరు రూరల్ మండలం వెల్లలూరు, మామిళ్ళపల్లి గ్రామాలలో ముఖ్య నాయకులతో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుపాను మూలిగే నక్క పైన తాటి కాయ పడినట్టు రైతాంగం ఉసురు తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం పండిం చిన పంటలకు సరైన మద్దతు ధర లేక నష్టపోయిన రైతు సోదరులు, ఈ సంవత్సరం ఏరువాకకు అందాల్సిన పెట్టుబడి సాయం అందకపోగా అప్పుచేసి పండించిన అపరాలు, కూరగాయలు సైతం తీవ్రంగా నిరాశపర్చాయని తెలిపారు. ఎరువులు సకాలంలో అందకపోవ టంతో అరకొరగా వేసిన పంట సైతం నీట మునిగిందని అన్నారు. ప్రభుత్వ ఉద్యో గులు, ప్రభుత్వ పెద్దలు పెద్ద మనసు చేసుకొని ఈ తుఫాను సందర్భంగా పంట నష్టపోయిన రైతులకు తక్షణ సాయంగా ప్రతి ఎకరాకు రూ.20 వేలు మరొక రూ.30వేలను వడ్డీ లేని రుణాలు రైతులకు అంద జేసి వారికి స్వాంతన చేకూర్చాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు.

మొంథా ధాటికి పంటలు ధ్వంసం



నేటి నుండి యథావిధిగా విద్యాసంస్థలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, చిలకలూరిపేట

గురువారం నుండి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు యథావిధిగా కొనసాగుతాయని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికశుక్ల ప్రకటించారు. ఏదైనా నిర్మాణ నష్టం, నీరు నిలిచిపోవడం లేదా ఇతర భద్రతా సమస్యలు తలెత్తితే విద్యార్థులను వెంటనే సురక్షిత గదులకు లేదా ప్రత్యామ్నాయ సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా చిలకలూరిపేటలో అడ్డరోడ్డు వద్ద పొంగి పొర్లుతున్న వర్షపు నీటిని, లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. సుగాలి కాలనీ జెడ్పి పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఆశ్రయం పొందుతున్నవారితో మాట్లాడారు. కేంద్రంలోని పిల్లలకు బిస్కెట్లు ప్యాకెట్లు పంపిణీ చేశారు.



ప్రజాశక్తి - వినుకొండ

మొంథా తుపానుతో బుధవారం పల్నాడు జిల్లా అతలాకుతలమైంది. పొలాల్లోకి భారీగా చేరిన వాననీరు పంటలను తీవ్రంగా దెబ్బతీయగా, వాగులువంకలు ఉధృతంగా ప్రవహించి రాకపోకలను స్తంభింపజేశాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై జనం బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకూ అంతరాయం ఏర్పడింది.

వినుకొండ నియోజకవర్గంలోని వినుకొండ, ఈపూరు, నూజెండ్ల, శవల్యాపురం, బొల్లాపల్లి మండలాల్లో మిరప, పొగాకు, కంది, వరి తదితర మెట్ట పైర్లు నీటమునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వినుకొండ పట్టణంలోని చెక్క వాగు పొంగి రాజీవ్ రజక కాలనీ నీట మునిగింది. అరుంధతి కాలనీ జలమయమైంది. 300 కుటుంబాలను నిర్మల స్కూల్ పునరావాస కేంద్రాల తరలించారు. మిద్దె బావి, సుందరయ్య కాలనీలో వరద నీరు చేరింది. ముట్లకుంట కాలనీ పూర్తిగా నీట మురగడంతో స్థానికులను ఎన్ఎస్పి కాలనీలోని హెల్త్ సెంటర్ తరలించారు. మండలంలోని పెద్దకంచర్ల గ్రామంలో చెరువుకు అలుగుపడటంతో జెసి పరిశీలించారు. గుండ్లకమ్మ నది పొంగి పొలాలను ముంచి ప్రవహిస్తోంది. కుమ్మరిపాలెం పెద్ద పసుపులేరు వాగు బ్రిడ్జిపైగా, శావల్యాపురం మండలం చిన్న కంచర్ల నుండి పిచ్చుకల పాలెం వంతెన పైనుండి వర్షం నీరు ప్రవహించడం, నాగులవరం వద్ద ఉన్న కొంకేరు వాగు పొంగి పొల్లడం, బొల్లాపల్లి మండలం వెల్లటూరులో చలమ వాగు ఉధృతికి రాకపోకలు నిలిచాయి. వినుకొండ పట్టణంలోని సీతయ్య నగర్ రెండో వార్డు, ఇందిరా నగర్, విష్ణు గుండె నగర్ శ్రీచైతన్య స్కూల్, కమ్మ హాస్టల్ వద్ద డ్రెయినేజీ లేక వర్షపు నీరు భారీగా నిలిచింది. నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో గుడిసెలన్నీ నీటమునిగాయి. 130 కుటుంబాలకు జెడ్పి పాఠశాలలో పునరావాసం కల్పించారు. కొండలరాయునిపాలెం గ్రామంలో వర్షం వరద నీరు గొర్రెల షెడ్డుల్లోకి చేరి 11 గొర్రెలు మృతి చెందాయి. వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామంలో వాగు ఉధృతికి గ్రామంలోకి నీరు చేరింది. కొండ్రముట్ల నుండి బొల్లాపల్లి వెళ్లే రోడ్డులో భారీ మూడు చెట్లు విరిగి పడి రాకపోకలు నిలిచిపోయాయి. వాటిని సిబ్బంది తొలగించారు. బొల్లాపల్లి నుండి మూలపాడు గ్రామానికి వెళ్లే రహదారి నీటి ఉధతికి కొట్టుకుపోయి రాకపోకలు నిలిచాయి. వెల్లటూరులో రైస్ మిల్లు నీట మునిగింది. బీసీ కాలనీలోకి వర్షం నీరు చేరింది. ఉప్పలపాడు వద్ద చెరువు అలుగు తెగి ఎస్సీ కాలనీ లోకి నీరు చేరింది. నూజెండ్ల మండలం ములకలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కరెంటు స్తంభాలు నేలవాలి గామాల్లో అంధకారం నెలకొంది.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుండి భారీవానతో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పత్తి, మిర్చి, కంద, పసుపు పంటలు దెబ్బతిన్నాయి. భట్లూరు సమీపంలో లోలెల్ చప్టాపై వరదనీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నందిగామ మార్గంలో లోలెవల్ చప్టాలపై వరద నీటి ప్రవాహంతో సత్తెనపల్లి - అమరావతి మార్గంలో, పెదమక్కెన గర్నెపూడి మార్గంలో ఉన్నా లోలెవల్ చట్టా వరదనీటితో మునగటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సత్తెనపల్లి - పాకాలపాడు మార్గంలో భారీ చింతచెట్టు నేలకొరిగింది. దీపాలదిన్నెపాలెం- రెంటపాళ్ల గ్రామాల మధ్య చప్టాపై ఎద్దువాగు ఉధృతి నేపథ్యంలో వాహనాలు వెళ్లకుండా రెవెన్యూ సిబ్బంది కాపాలా ఉన్నారు. ఎద్దు వాగు పరివాహక ప్రాంతంలో 30 ఎకరాల్లో కంద పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎకరానికి రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టామని, నిండా మునిగామని రైతులు వాపోతున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని వావిలాల ఘాట్ పునరావాస కాలనీ నీటమునింగింది. స్థానికులను పునారావాస శిబిరాలకు తరలించారు. పట్టణంలో మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల ఉన్న 130 మందిని తరలించారు.




ప్రజాశక్తి - మాచర్ల : తుపాను ప్రభావంతో మాచర్ల పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుండి బుధవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. పట్టణం గుండా ప్రవహించే చంద్రవంక వాగు పొంగిపొర్లుతోంది. వరద నీరు మాచర్ల పట్టణంలోని పలు ప్రాంతాలకు చేరి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. 13వ వార్డు, రత్తయ్య బజార్, జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్ వెనుక భాగాన, నెహ్రూనగర్ నీలిమా సినిమా హాల్ ప్రాంతంలో వరద నీరు చేరి ఇళ్ల నీటిమునిగాయి. స్థానికులను ఇళ్ళ ఖాళీ చేయించారు. జమ్మలమడక వెళ్లే రహదారిలో, వినాయకగుట్ట, అజాద్‌నగర్‌కు వెళ్లే మార్గంలోని బ్రిడ్జిపై నుండి చంద్రవంక ఉధృతంగా ప్రవహిస్తోంది. లింగాపురం గ్రామానికి వెళ్లే వద్ద కూడా చంద్రవంక బ్రిడ్జిపై నుండి పారుతోంది. ఆయా ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చంద్రవంకలో గంటగంటకు నీటి మట్టం పెరుగుతోంది. చంద్రవంక వాగు ఒడ్డున నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో మానుకొండ కళ్యాణ మండపంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఇంకో రెండు అడుగుల నీటి మట్టం పెరిగితే మాచర్ల పట్టణంలో అడుగునీరు చేరుతుంది. చంద్రవంకకు పై ఎత్తున చెరువులు గండులు పడితే మాచర్ల మునగటం ఖాయమని స్థానికులు భయపడుతున్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పర్యటించారు. సహాయక చర్యలపై అధికారులతో సమీక్షించారు. ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంతోనే చంద్రవంక వాగు వరద ముంపుకు శాశ్వత పరిష్కరమని, దీనిపై అంచనాలు రూపొందించామని ఎమ్మెల్యే చెప్పారు. జమ్మలమడకకు వెళ్లే రహదారిపై ఉన్న చంద్రవంక లోలెవల్ బిడ్జిని పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు : తిమ్మాపురం వద్ద జాతీయ రహదారి బైపాస్ అండర్ పాస్ వద్ద భారీగా వర్షపు నీరు చేరగా పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, ఇతర అధికారులు పరిశీలించారు. యడ్లపాడు నుండి నాదెండ్ల వెళ్లే దారిలో బ్రిడ్జి పక్కన ఉన్న సుబాబుల్ కొట్టడానికి వచ్చిన 5 కుటుంబాలను నాదెండ్ల హైస్కూల్‌కు తరలించారు. మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పత్తి, మిర్చి పైర్లు నేలవాలి దెబ్బతిన్నాయి. జాలాది గ్రామంలో కోత దశలో ఉన్న సజ్జ పంట ధ్వంసమైంది. బాధిత రైతులకు సత్వరం పరిహారం ఇవ్వాలని రైతుసంఘం నాయకులు కె.రామారావు, ఎన్.కాళిదాసు కోరారు. యడ్లపాడులో జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్వీసు రోడ్డు వెంబడి డ్రెయినేజీ లేకపోవడం వల్ల ఇళ్లల్లోకి నీరు చేరుతోందని, ఈ డ్రెయినేజీలో కొంత భాగం పెదనందిపాడు బ్రాంచ్ కాల్వలో కలుస్తుందని, వీటిని ఉపయోగిస్తే ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉందని చెప్పారు.సర్వీసు రోడ్డును పూర్తి చేసి డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల పరిశీలనలో పి.వినయ్, జె.శివాంజనేయులు, ఎం.వెంకట్రావు, కె.రామస్వామి, పి.రవి, కె.అనిల్, వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు : ఖమ్మంపాడు వాగు ఉధృతితో రాకపోకలు స్తంభించాయి. అక్కడక్కడ చెట్లు కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. పత్తి పైర్లు నేలకొరి కాయలన్నీ కుళ్లిపోయే ప్రమాదం, మిర్చి మొక్కలు ఉరకెత్తే అవకాశం ఉంది.







ప్రజాశక్తి-దాచేపల్లి : మూడ్రోజులు కురిసిన వానకు పత్తిపైర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పత్తికాయలు గూడ రాలి పత్తి చెట్లు ఎరుపెక్కాయి. ఎకరాకు సుమారు రూ.30 వేలు చొప్పున రెండెకరాలకు రూ.60 వేల పెట్టుబడి పెట్టానని, పంట చేతికొచ్చే సమయంలో తుపాను దెబ్బతీసిందని రైతు వీరాస్వామి వాపోయాడు. కౌలుకు పదెకరాలు తీసుకుని అప్పులు చేసి పెట్టుబడి పెట్టగా ఇప్పుడు పంట తడిసి నేలపాలైందని కౌలురైతు దానం సైదారావు ఆవేదనకు గురయ్యాడు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రౌతులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - రాజుపాలెం : మండలంలో పత్తి, మిరప, వరి, కూరగాయల పంటలపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. అనుపాలెం వద్ద రహదారి పైకి వర్షపు నీరు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గణపవరం నుండి బలిజేపల్లి వైపు వెళ్లే రహదారిలో వాగు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. కొండమోడులో 20 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గణపవరంలో కూలిన ఇళ్లను అధికారులు పరిశీలించి బాధితులను సురక్షితంగా ప్రాంతంలో ఉంచారు.



ప్రజాశక్తి - అచ్చంపేట : మండలంలో వర్షం తక్కువగా ఈదురు గాలులు ఎక్కువగా ఉండటంతో చల్లగిరగా, కోనూరు, అచ్చంపేట గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. అచ్చంపేటలోని వాగోడు లోలెవెల్ చప్టాపై చిగురుపాడు - అమరావతి రహదారిపై వాగులు పొంగిపొర్లుతున్నాయి. ప్రయాణికులు రాకపోకలు నివారిస్తూ ప్రమాదాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బంది పహారా కాస్తున్నారు.

కె.వి పాలెం ఇసుకరీచ్ సమీపంలో గుడారాల్లోని 100 మంది వలస కూలీలకు సచివాలయంలో పునరావసం కల్పించారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : నాగార్జునసాగర్ విజయపురిసౌత్ ఫిషరీస్ కార్యాలయం సమీపంలో ఘాట్ రోడ్‌లో భారీ బండరాయి రోడ్డుపై పడింది. పొక్లెయినర్ ద్వారా తొలగించారు. మాచర్ల మండలం కొప్పునూరు గుండపు వాగు ఉధృతంగా ప్రవిస్తూ వాహనాల రాకపోకలు అంతరాయం కలిగించింది.





ముంపు ప్రాంతాల్లో సిపిఎం పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి



ముంపుబారిన పడిన సత్తెనపల్లి పట్టణంలోని సుందరయ్య కాలనీ, నాగన్న కుంట, వావిలాల ఘాటు నిర్వాసితుల ప్రాంతం, మాస్టిన్‌పేటలో సిపిఎం బృందం బుధవారం పర్యటించింది. 17 ,19 వార్డులను, నాగన్నకుంట ప్రాంతాలను లక్కరాజు గార్లపాడు రోడ్‌లోని పొలాలు నుండి, వాగుల నుంచి వచ్చిన వరద నీరు ముంచెత్తడంతోపాటు చేనేత మగ్గం గుంతల్లో నీరు చేరింది. నరసరావుపేట రోడ్డులోని వాగు వద్ద వెడల్పు తక్కువగా ఉండటంవల్ల వరద నీరు తన్నిపట్టి లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంది. మాస్టిన్‌పేట రెండవ లైను, టిడ్కో నివాసాల మధ్య సరైనటువంటి డ్రైనేజీ లేకపోవడం వల్ల ఇళ్లల్లోకి నీరు చేరింది. మంగళవారం రాత్రి నుండి బుధవారం వరకు తిండి లేక అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. నిర్వాసితుల నివాస ప్రాంతాలైన సత్తెనపల్లి టిటిడి కళ్యాణ మండపం, యాదవ హాస్టల్ ప్రాంతాలను బృందం పరిశీలించింది. ఈ రెండు ప్రాంతాల్లో నిర్వాసిత ప్రజలు ఏ ఒక్కరు లేకపోవడంతో ప్రభుత్వ అధికారులతో హెల్ప్‌లైన్ ద్వారా మాట్లాడితే వారు రెవెన్యూ వారితో సంప్రదించాలని సమాధానమిచ్చినట్లు నాయకులు చెప్పారు. ఇకనైనా వారి పట్ల బాధ్యత తీసుకొని సదుపాయాలు సౌకర్యాలు కల్పించాలని, నష్టపరిహారాన్ని అందించి వారిని ఆదుకోవాలని సిపిఎం కోరింది. సుందరయ్య కాలనీ మీద ఉన్న వాగుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. పరిశీలనలో సిపిఎం పట్టణ, రూరల్ కార్యదర్శులు డి.విమల, పి.మహేష్, నాయకులు హరిపోతురాజు, మస్తాన్‌వలి, రాజ్‌కుమార్, ప్రభాకర్, వెంకట్రావు పాల్గొన్నారు.

సిపిఎం చొరవతో భోజనం..

ప్రజాశక్తి - అమరావతి

స్థానిక బుడగజంగాల కాలనీని సిపిఎం నాయకులు సందర్శించారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బి.సూరి బాబు.. స్థానికుల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి బుధవారం ఉదయం భోజనం సరఫరా చేశారు.



ముంచిన మొంథా



కొల్లిపర మండలంలో నేలవాలిన అరటి, వరిపైరు, కంద

పడిపోయిన కంద పైరు

పొన్నూరులో

మొంథా తుఫాన్ రైతులను అతలాకుతలం చేసింది. తుఫాన్ ధాటికి తాడేపల్లి మండలం పెనుమాక, ఉండవల్లిలో ఉల్లి, అరటి పంటలు ధ్వంసమయ్యాయి. కొల్లిపర మండలంలో వాణిజ్యపంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. పొన్నూరు మండలంలో వరిచేలు నీట మునిగాయి. తుళ్లూరు మండలం పెదపరిమిలో పత్తిపంట నీటి మునిగింది. ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాడేపల్లిలో నీటిమునిగిన ఉల్లి పంట

ఉల్లి రైతు కంట కన్నీరు.. అరటి రైతుది అదే దారి

ప్రజాశక్తి- తాడేపల్లి

మొంథా తుఫాన్ రాజధానిలోని పెనుమాక, ఉండవల్లి గ్రామాల్లోని ఉల్లి, అరటి పంట వేసిన రైతులకు అపార నష్టాన్ని కలిగించింది. గత 10 ఏళ్లలో ఎటువంటి నష్టాన్ని తాము చవి చూడలేదని రైతులంటున్నారు. పైన పేర్కొన్న రెండు గ్రామాల్లో ఉల్లి పంట సుమారు 300 ఎకరాల్లో రైతులు సాగుకు చేస్తున్నారు. మరో నెలలో ఉల్లిపాయ తీతకు వస్తున్న దశలో వచ్చిన తుఫాన్ రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఇప్పటికే ఎకరానికి 80 వేలు పెట్టుబడి పెట్టిన రైతులకు రూ.2 కోట్ల,40 లక్షలు మేర నష్టపోయారు. ఉల్లి పంట వేసిన పొలాల్లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలబడటంతో ఆయా ఊరకట్టే అవకాశం ఉందని రైతులు తెలిపారు. 300 ఎకరాలలో అరటి వేసిన రైతులు ఎకరానికి రూ.50 వేలు చొప్పున రూ1.50 కోట్లు నష్టపోయామని వాపోతున్నారు. గులాబీ, లిల్లీ తదితర పూల తోటలు నీటమునగడంతో ఉరకెత్తే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

మొంథా తుపాను ధాటికి ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో నష్టపోయిన ఉల్లి, అరటి, పూల తోటలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకర్‌రావు, కొర్రపోలు జగదీశ్వర్ రెడ్డి కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో దిగి పంట నష్టం అంచనాలను రికార్డ్ చేసి, తగిన నష్టపరిహారం అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - కొల్లిపర

మొంథా తుఫాను కొల్లిపర మండలంలో రైతులకు భారీగా నష్టం చేకూర్చింది. తీరం దాటే సమయంలో వీచిన ఈదురు గాలులకు మండలంలోని ఆయా గ్రామాల్లో సాగు చేస్తున్న వరి వాణిజ్య పంటలైన అరటి కంద పంటలు నేల వాలాయి. భారీగా పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో తుపాను రూపంలో దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

వరి పంట తీవ్ర నష్టం

ప్రజాశక్తి - పొన్నూరు

ముంథా తుఫాన్‌తో వరి పంటకు నష్టం వాటిల్లింది. పొన్నూరు మండల పరిధిలో సుమారు 32 వేల ఎకరాలలో వరి సాగు చేస్తుండగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొట్ట దశలో ఉన్నటు పైరు నీట మునిగింది. తుపాను తీరం దాటినప్పటికీ మరో రెండు రోజులు పాటు వర్షాలు పడే సూచనలు ఉండటంతో ఇప్పటికే అనేక ఒడిదుడులు ఎదుర్కొంటున్న రైతులకు నష్టాన్ని తెచ్చిపెడు తుందని భయపడుతున్నారు. పొన్నూరు మండలంలోని పచ్చలతాడిపర్రు , వల్లభ రావు పాలెం, పెద్దపాలెం, ఆలూరు, మామిళ్ళపల్లి గోళ్ళమూడిపాడు, బ్రాహ్మణ కోడూరు, ములుకుదురు మనవ తదితర గ్రామాలలో వరి నీట మునిగింది. మెట్ట ప్రాంతాలలోని కూరగాయలు సాగు సైతం అధిక వర్షాల కారణంగా నీట మునిగినట్లు రైతులు బోరున విలపిస్తున్నారు. ఏడిఏ రామ కోటేశ్వరి మాట్లాడుతూ తుపాను ప్రభావిత ప్రాంతాలలో మరో రెండు రోజుల తర్వాత పంట నష్టంపై పరిశీలన చేసి వివరాల అందిస్తామని తెలిపారు.

నిండా మునిగాం.. ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

తుఫాన్ కారణంగా పత్తి చేలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాలలో 10 వేల ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. కొద్దిరోజుల నుంచి పత్తితీతలు, అమ్మకాలు జరుగుతుండగా తుఫాన్ రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. అధిక వర్షాలకు తోడు కొండవీటి వాగు, కోటేళ్ల వాగులు పొంగి పత్తి చేలను ముంచెత్తి కోలుకోలేని దెబ్బ తీశాయని పెదపరిమికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెదపరిమికి చెందిన పత్తి రైతు సరిపూడి సాంబశివరావు మాట్లాడుతూ '40 ఎకరాలు పత్తి సాగుచేశానని 20 లక్షలు పెట్టుబడి పెట్టానని తెలిపారు. వర్షాలకు పత్తి చేలు మునిగాయని, ఎకరానికి 5 - 6 క్వింటాళ్ల చొప్పున 150 పైగా క్వింటాళ్ల పత్తి ఉండిపోయిందని వాపోయారు. తీవ్రంగా నష్టపోతామన ప్రభుత్వం 20వేలు నష్టపరిహారం చెల్లించాలని వేడుకొంటున్నారు. వేలు చెల్లించాలని కోరుతున్నాను. రైతు షేక్ ముస్తఫా మాట్లాడుతూ ఎకరం కౌలు తీసుకొని పత్తి సాగు చేశానని వర్షాల వల్ల కాయలు కుళ్ళిపోతున్నాయిన వాపోయారు. 10 క్వింటాళ్ల పైనే దిగుబడి వచ్చేదని ఇప్పుడు అంతా సర్వ నాశనం మైందని వాపోయారు. రైతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 15 ఎకరాలు పత్తి సాగు చేస్తున్నానని, వర్షం, గాలులు ధాటికి పత్తికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పత్తిని పీకేసి శనగ, జొన్న లాంటివి సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నష్ట పరిహారంతో పాటు వ్యవసాయాధి కారులు శనగ విత్తనాలు, రెండు కట్టలు బలం మందులు ఇస్తే రైతులకు ఉపయోగపడుతుందన్నారు.



పడిపోయిన భారీ వృక్షం

నేలకొరిగిన భారీ వృక్షం

ప్రజాశక్తి-తాడేపల్లి

తుపాను ప్రభావంతో అమరావతి కరకట్టపై పంప్ హౌస్ సమీపంలో భారీ వృక్షం నేల కూలింది. వందేళ్ళ పైపడ్డ చెట్టు పడిపోవటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఎంటీఎంసీ కమిషనర్ ఎస్.కె. అలీం బాషా, తాడేపల్లి తహశీల్దార్, ఇతర అధికారులు అక్కడకు చేరుకొని చెట్టును తొలగించే ప్రయత్నం ముమ్మరం చేశారు. గురువారం కూడా పనులు చేపట్టనున్నారు.



పొంగిన కొట్టేళ్లవాగు.. నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - తుళ్లూరు

తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని కొట్టేళ్లవాగు, కొండవీటి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రాజధానికి అమరావతికి రాకపోకలు నిలిచిపోయాయి. గుంటూరు నుంచి సచివాలయం, హైకోర్టు, ఇతర నిర్మాణ ప్రదేశాలకు నిత్యం రాకపోకలు సాగుతుం టాయి. హైకోర్టుకు జడ్జీలు, న్యాయవాదులు, సచివాలయంకు ఉద్యోగులు, సిబ్బంది రాకపోకలు జరుపుతుంటారు. వాగులు పొంగడంతో రాకపో కలు నిలిచి అనేక ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాలు కురిసిన ప్రతిసారి కొటేళ్లవాగు పొంగడం, రాజధానికి రాకపోకలు నిలిచి పోవడం సర్వసాధారణమైందని ప్రజలు విమర్శిస్తున్నారు.

విరిగిన చెట్లు..

వర్షం, బలమైన గాలులు వీచడంతో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపోయాయి. తుళ్లూరు ఎస్సి, వడ్డెర కాలనీలలో చెట్లు కూలిపోయాయి. పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరింది.

ప్రత్తిపాడులో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను, లో లెవెల్ చప్టాలను అధికారులతో కలిసి కలెక్టర్ తమీం అన్సారియా బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని చిన్న కొండ్రుపాడు లోతట్టు చప్టా, కొండ వాగు పొంగడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. కోయవారిపాలెం, బొర్రావారిపాలెం, గొట్టిపాడు రోడ్డు చప్ట ప్రత్తిపాడులోని ఎస్ఎంఎస్ కాలేజీ వద్ద చప్టాలపై వరద నీరు పారుతోంది. చిన్న చెరువు ఉప్పొంగటంతో మల్లయ పాలెం సెంటర్ నుండి బి.వీ.ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల వరకు నీళ్ళు నిలిచి పోయాయి. పునరావాస కేంద్రాలను కూడా పరిశీలించారు. అక్కడి ప్రజలతో కలెక్టర్ మాట్లాడుడారు. సైడ్ కాల్వలు తీయకపోవడం వలనే మాకు ఈ పరిస్థితి ఏర్పడింది అని కలెక్టర్ ఎదుట వారు వాపోయారు.

అన్న క్యాంటిన్లను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

అన్నక్యాంటీన్ల పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మిర్చియార్డ్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన అన్న క్యాంటీన్ల పరిసరాల పరిశుభ్రత పట్ల సిబ్బంది ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ప్రధానంగా లైట్లు, షింక్ లో నీరు వచ్చేలా ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఆహార సరఫరా అనంతరం ప్రాంగణం శుభ్రం చేయాలని అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు.



ప్రత్తిపాడు మండలంలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు, ప్రత్తిపాడులో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ , ఫిరంగిపురం మండలంలో పొంగిపొర్లుతున్న వాగులు

పొంగిన వాగులు.. మునిగిన చేలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మొంథా తుపాను కారణంగా మండలంలోని వాగులు పొంగా పంటలు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని వంగిపురం గ్రామం చుట్టూ నాలుగు రకాల మురుగు కాల్వలు ఉన్నాయి తుగలం కాల్వ, పల్లపాడు వైపు రామ వాగ, పిల్లల వాగు, మేకల వాగు రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పొంగి పొర్లుతున్నాయి. ఊరికి తూర్పుగా అప్పాపురం చానల్ పొంగి పొలాలు మునిగి పోతున్నాయి. నియోజకవర్గంలో రైతులు ఎత్తువగా మిరప, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. ఒక వైపు వైరస్ మరొక వైపు వర్షాలు వరదలు కారణంగా తాము పంటలు నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా వాగులు వల్ల ఊరు, పంటలు మాత్రం ఆగడం లేదు. సమస్య పరిష్కారం చూపడం లేదు. వ్యవసాయం చేసే రైతులు కూడా తగ్గారు. అధికారులు స్పందించి వాగుల నుంచి తమ పంటలను కాపాడాలని, శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని వివిధ గ్రామాలలో వాగులు పొంగి బ్రిడ్జిలపై ప్రవహించటంతో ప్రజలు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగి రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. గాలి వీచటంతో చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలు, తీగలుపై పడి కరెంటు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బేతపూడి హరిదాసుల కాలనీలో 15 గృహాలకు విద్యుత్ పోల్స్ లేక సర్వీస్ వైర్లు తెగుపడి కరెంటు లేక స్థానికులు ఇబ్బంది పడ్డారు. వెంటనే స్పందించిన తహశీల్దార్ కొత్త స్తంభాలు వేస్తామని హామీ ఇచ్చారు. పొలాలలోని వర్షపు నీరు హరిదాసుల కాలనీ ఇళ్లలోకి చేరి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. నుదురుపాడు, మేరికపూడి, పొనుగుపాడు గుండాల పాడు, మునగపాడు, బేతపూడి 113 తాళ్లూరు తదితర గ్రామాలలోని వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపో యాయి. తహశీల్దార్, ఎంపీడీవో, పోలీస్ సిబ్బంది మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించారు.



ఆహార ప్యాకెట్ అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

తుపాను బాధితులకు యుటిఎఫ్ చేయూత

ప్రజాశక్తి - వినుకొండ

మూడురోజులుగా రాష్ట్రాన్ని కుదిపేస్తున్న మొంథా తుఫాను కారణంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యుటిఎఫ్ శ్రేణులు వినుకొండ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సుందరయ్య నగర్‌కాలనీ వాసులకు, గాయత్రీనగర్, రెడ్డినగర్, హనుమాన్‌నగర్లలో గుడారాలలో నివసిస్తూ, వర్షాలకు బట్టలన్నీ తడిసిపోయి, వండుకోటానికి కనీస సౌకర్యాలు లేని లోతట్టు ప్రాంతాలలోని 200 కుటుంబాలకు భోజన సదుపాయం కల్పించారు. దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.వి.లింగయ్య, పల్నాడు జిల్లా కోశాధికారి ఎం.రవిబాబు, జిల్లా ఆడిట్‌కమిటీ కన్వీనర్ ఆర్.అజయ్ కుమార్, కమిటీమెంబర్ పి.ఎ.జిలాని, ఎం.విజయభాస్కర రావు, విశ్రాంత ఉపాధ్యాయులు జి. నాగేంద్రుడు, సిహెచ్ తిరుపతిరెడ్డి, బి.నాగేశ్వరరావు, బి.రాము, సిహెచ్. మల్లి కార్జున్, ఎస్.కె.యం.సుభాని, ఎండి.గౌస్ పాల్గొన్నారు.

తుపాను బీభత్సం

ప్రజాశక్తి-ఈపూరు

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన గాలివానకు కొండ్రముట్ల-బొల్లాపల్లి, ఈపూరు-కూచినపల్లి ప్రధాన రహదారులకు అడ్డంగా భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో ఆ మార్గంలో రవాణా వ్యవస్థ స్తంభించింది. సమాచారం అందుకున్న ఎస్సై ఉమామహేశ్వరరావు సిబ్బందితో అక్కడికి చేరుకొని జెసిబి సాయంతో చెట్లను తొలగించారు. కొచ్చర్ల, ఈపూరు గ్రామాలలో సైడ్ కాలువలు లేక రోడ్లపైకి నీరు చేరి ఇబ్బందికరంగా మారడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు జేసీబీ సాయంతో కాలువలు తీయించి నీటిని బయటకు తరలించారు.

ప్రజాశక్తి - గురజాల

రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు గురజాలలో బీభత్సం సృష్టించింది గురజాల బస్టాండ్ సెంటర్ నుంచి కారంపూడి రోడ్డు వరకు రోడ్డు జలపాతాలను తలపిస్తున్నాయి. కమిషనర్ శివన్నారాయణ, మున్సిపాలిటీ సిబ్బందితో నిరంతరంగా పర్యవేక్షిస్తూ నీటిని బయటికి పంపేందుకు చర్యలు చేపట్టారు. కారంపూడి రోడ్డులోని రైల్వే ట్రాక్ దగ్గర వాగు రావడం వల్ల సిఐ భాస్కర్ గట్టిబందోబస్తు ఏర్పాటు చేసి కొంతవరకు రాకపోకలను నిలిపి వేశారు. చాలావరకు వరిచేలు నీట మునిగిపోవడంతో రైతులు తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని పలు గ్రామాలలో బుధవారం తహశీల్దార్ ధనలక్ష్మి, ఎంపీడీవో సాయి లీల, డిప్యూటీ ఎంపీడీవో శరత్ విస్తృతంగా పర్యటించారు. హుస్సేనగరం గ్రామంలో చెరువు కట్ట పొంగిపొర్లి నీరు కాలనీలోకి వచ్చాయి. దానికి మట్టి వేయాలని ఆదేశించారు. తాళ్లూరు, పరస, ఖమ్మంపాడు, పెదకూరపాడు, రామాపురం, బుచ్చియ్యపాలెం, లింగంగుంట్ల, చిన్న మక్కెన ప్రాంతాల్లోని పొంగిపొర్లిన వాగులను పరిశీలించారు. గాలికి ఒరిగిన చెట్లను కొమ్మలను తీసేయించారు. నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న నాచును తాళ్లూరులో, పరస వద్ద ప్రొక్లైన్‌తో తొలగింపచేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ కార్యదర్శులు సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వాగులు పొంగి ప్రవహించాయి. గోళ్ళపాడు చప్టా వద్ద నత్తెనపల్లి, నర్సారావుపేట ప్రధాన రహదారిపై వాగు పొంగి ప్రవహించడంతో ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిచిపోయాయి. గోళ్ళపాడు ఎస్టీ కాలనీలోకి నీళ్ళు రావడంతో తహశీల్దార్ నగేష్ సుమారు 25 కుటుంబాలకు దగ్గరలోనే ఉన్న రైతు సేవా కేంద్రంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి భోజన వసతులు కల్పించారు. చాగంటివారిపాలెం ఎస్టీ కాలనీలోకి వర్షపునీరు వచ్చే అవకాశం ఉండడంతో గ్రామ సర్పంచ్ జెసిబి సహాయంతో కాలువను శుభ్రం చేసి కొంతమేరకు కాలువ తవ్వారు.

దెబ్బతిన్న పంటలు - ఆందోళనలో రైతులు



ఈపూరులో...దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఈపూరు

మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను వినుకొండ ఏడిఏ సిహెచ్ రవికుమార్, ఏఓ ఆర్ రామారావు బుధవారం పరిశీలించారు. మండలంలోని కొచ్చర్ల, శ్రీనగర్,కొండాయపాలెం, అంగలూరు గ్రామాలలో కెఎన్ఎమ్ 1638 రకం వరి వంగడాన్ని రైతులు సాగు చేశారన్నారు.ఆయా గ్రామాలలో 104 మంది రైతులకు సంబంధించి 140.37 హెక్టార్ల పంట నష్టం వాటిలినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. వర్షం తగ్గుముఖం పట్టిన తర్వాత మరల పరిశీలన చేస్తామన్నారు. పడిపోయిన వరి దుబ్బులను పైకి లేపి ఎత్తి కట్టి లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడం ద్వారా గింజలు మొలకెత్తకుండా ఉంటాయన్నారు. రైతులు తగిన మోతాదులోనే ఎరువులను వాడాలని సూచించారు. ఆయనతోపాటు ఉద్యాన శాఖ అధికారి షేక్ నబి రసూల్, నూజెండ్ల ఏఓ ఆంజనేయులు నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు కోటేశ్వరరావు, ఈపూరు సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు ఉన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మొంథా తుఫాను ప్రభావంతో అన్నదాత విలవిలాడుతున్నాడు. మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు చెరువులను తలపించాయి. వర్షానికి పసుపు, మిరప, పత్తి పంట పొలాల్లో నీరు నిలబడడంతో నీటిని బయ టకు వెళ్లగొట్టేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. మండలంలో కాయదశలో ఉన్న పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. పసుపు పంటలో నీరు నిలబడడం వలన వేరుకుళ్ళు, ముదురు వరిపంట పొట్టదశలో ఉండడం వలన తెగుళ్ల వచ్చే ప్రమాదం పొంచి ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షం ధాటికి పశువుల పాకలు బురదమయం కావడంతో పశువులకు పశుగ్రాసం లేక పాలఉత్పత్తి తగ్గుతోందనీ పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మొలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు ప్రత్తి పంటకు మొంథా తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మండలంలో 20 గ్రామాలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ వారు ఆన్‌లైన్‌లో పత్తి వేశామని 19,409 ఎకరాలు నమోదు చేశారు. మూడేళ్లుగా మిరప పంట అనుకూలంగా లేకపోవడంతో రైతులందరూ పత్తి పంట వైపు మొగ్గుచూపారు. ఈ వ్యవసాయ సీజన్ ప్రారంభం నుండి విపరీతమైన వర్షాలు, ఎండతో కాలం గడిచిపోయింది. జూన్ 25, 26 తేదీల్లో తొలి విడత పత్తిని రైతులు సాగు చేశారు. రెండో విడత జులై 18, 19 విత్తారు. అతివృష్టిని తట్టుకొని పంట చేతికొచ్చే సమయం ఆసన్నమైంది. ఈనెల 25, 26వ తేదీల్లో వర్షం కురిసింది. పొలం ఆరకముందే తుపాన్ పత్తి పంటను ముంచేసింది. ఎకరాకు సుమారుగా 50 నుంచి 70 కాయలు కాసాయి. కొంత గూడదశలో, మరికొంత పూత స్థాయిలో ఉంది. వారం కింద కురిసిన వర్షంతో గూడ, పింద నేలపాలయ్యాయి. ఈ వర్షంతో కాయలు మొత్తం కుళ్లి పోయే దశ ఏర్పడింది. పగిలిన పత్తిగుబ్బల నుంచి మొలకలు వచ్చే



పెద్దకూరపాడులో... దెబ్బతిన్న పత్తిపంట

పరిస్థితి ఏర్పడింది. గాలులకు పత్తి చెట్లు ఒక వైపునకు పూర్తిగా ఒరిగిపోయాయి. ఎకరానికి రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు తెలిపారు. మిరప పొలం ఉరకెత్తే దశలో ఉంది. నాన్నుడు వర్షం కావడంతో కాండకుళ్ళి ఎదుగుదలకు కాపునకు ఆటంక పరిస్థితి. సోయా చిక్కుడు కూడా దెబ్బతింటోంది.ఉద్యాన పంటలకూ నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

9400 ఎకరాల్లో నష్టం ప్రాథమిక అంచనా

పత్తి 9442 ఎకరాలు ప్రాథమికంగా నష్టం వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు పెదకూరపాడు మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. పలు గ్రామాలలో పంటను పరిశీలించామన్నారు. దెబ్బతిన్న మాట నిజమే అన్నారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

పత్తి పంటను సత్తెనపల్లి వ్యవసాయ సహాయాధికారి బి రవిబాబు పరిశీలించారు. బుధవారం మండలంలోని చిన్న మక్కెన, లింగంగుంట్ల, పొడపాడు, ముసాపురం, పాటిబండ్ల గ్రామాల్లోని పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సలహాలు ఇచ్చారు. పొలంలోనే నీటిని బయటికి పంపాలన్నారు. పూత గూడ రాలుతుంటే ప్లానో ఫిక్స్ పిచికారి చేయాలన్నారు. తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ పిచికారి చేసుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి డి కష్ణయ్య, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అమరావతిలో ... దెబ్బతిన్న పత్తిపంట

ప్రజాశక్తి - అమరావతి

మొంథా తుఫాన్ ప్రభావంతో అమరావతి మండలంలో పలు గ్రామాలు నిండా మునిగిన రైతులు, చిరు వ్యాపారులు. పలు గ్రామాలలో వాగులు పొంగిపొర్లి రోడ్డు మీదకి రావ డంతో నిలిచిన రాకపోకలు. వర్షం కారణంతో అమరావతి లింగాపురం గ్రామానికి మధ్య పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కాంఇంగా పత్తికాయలు కుళ్ళి దిగుబడిపై ప్రభావం చూపు తోందని వాపోతున్నారు. తుపాన్‌దెబ్బకు పత్తి, మిరప, పసుపు, వరి పొలాల్లో నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి బెల్లంకొండ

బెల్లంకొండ మండలంలోని పలు గ్రామాలలో వరి పంట పూర్తిగా నీటిలో మునిగిపోయింది. పంట చేతి కందేలోపే తుపాన్ వల్ల తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి మిరప, కూరగాయలు వేసిన రైతులు తీవ్రంగా పోయారు. మండలంలో వ్యవసాయాధికారి నష్టపోయిన పంటను అంచినా వేస్తున్నారు.



ముప్పాళ్లలో...పసుపు పంటలో నిలబడిన వర్షపునీరు



రెంట చింతలలో నేలవాలిన వరిపంట

ప్రజాశక్తి - రెంటచింతల

మొంథా తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం పది రోజుల్లో చేతికొచ్చే వరి పంట నేలవాలింది. దీంతో గింజంతా నీటి పాలైంది. ఈదురు గాలులకు చేలల్లో కొంత భాగం నేలకొరిగింది. మంచికల్లు ,పాలువాయి ,రెంటచింతల, వరి చేలల్లో నీరు చేరింది. రైతు కంట కన్నీరు కార్చే పరిస్థితి ఏర్పడింది.



వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ప్రభుత్వ ఆదేశాలానుసారం మండలంలోని జానపాడు, గుత్తికొండ గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి పర్యటించారు. వరి పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే కాలువల ద్వారా బయటికి పంపించాలని, పడిపోయిన వరి పంటను పరిశీలించి వాటిని లేపి కట్టలుగా కట్టటం వలన మొలకెత్తి పాడవకుండా ఉంటాయని తెలియజేసారు. రైతులందరూ ఎటువంటి పంట కోతలు నిర్వహించవద్దని, తుపాను ప్రభావాన్ని బట్టి పంటచేలలో కాలువలు తీసి నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని, తెగులు నివారణ కొరకు నీటిని తొలగించి ఎకరానికి ప్రోపికొనజోల్ 25 ఈసీ 200 మిల్లీలీటర్లు లేదా హెక్సా కొనజోల్ 5 ఎస్‌సి 400 మిల్లీమీటర్లు పిచికారి చేయాలని ఫలితంగా గింజరంగు మారకుండా, పొడ తెగులు, మానిపండు తెగులు రాకుండా నివారించవచ్చని తెలియజేశారు. ఇప్పటికే వరి పంట కోసినట్లయితే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని కోసిన పనలపై పిచికారి చేయాలని సూచించారు. కంది పంటలో తీసుకోవ లసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జానపాడు గుత్తికొండ రైతులు, వ్యవసాయ సిబ్బంది గోపి, సల్మా, రాజశేఖర్, అహ్మద్, రైతులు పాల్గొన్నారు.



బెల్లంకొండలో ... దెబ్బతిన్న వరిపంట

మౌలిక వసతులకు నోచని జగనన్న కాలనీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జగనన్న కాలనీలో రోడ్లు, కాలువలు లేవనీ, ప్రధానంగా విద్యుత్ సరఫరా లేదని 5వ లైన్లో నివాసముంటున్న మస్తాం శేషు అన్నారు. విద్యుత్ సరఫరా లేక వర్షాలు, ఇతర సమయాల్లో పాములు విష జంతువులతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తుపాన్లు వర్షాలప్పుడు ఇంజనంపాడు, పసుమర్రు గ్రామాలలోని నీరంతా జగనన్న కాలనీలో గుండా ఓగేరు వాగులోకి వెళుతుందని దీంతో వర్షం అంటేనే భయమేస్తోందని చెప్పారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు పసుమర్రు జగనన్న కాలనీలో పర్యటించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా కాలువలు సక్రమంగా లేకపోవడం చీరాల, పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ లోపాల వల్ల నీరు ఎక్కడికక్కడే ఆగిపోయిందన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు వెంటనే పూనుకొని భవిష్యత్తులో రాబోయే వరదలు నుంచైనా ఈ కాలనీలను నీటి ముంపునకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని తాగునీరు, కరెంటు, రోడ్లు కాలువలు వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలకు ఆనుకొని ఉన్న పంటపొలాలు ముంపునకు గురయ్యాయని పంట నష్టపరిహారం చెల్లించాలని, సిమెన్‌లో ఉన్నవారికి 25కిలోల బియ్యం, కంది పప్పు, నూనె, నిత్యావసర వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గోదాంలో షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి గ్రామంలో ఆంజ నేయ జనరల్ మర్చంట్ గూడెంలో తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో గోదాంలో మంటలు చెలరేగాయి. రూ.10 లక్షల వరకు నష్టం కలిగిందంటూ. సనిశెట్టి నాగమల్లేశ్వర రావు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



కాలిన వస్తువులు

వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం

పునరావాస కేంద్రాల్లో కొనసాగుతున్న సహాయ సహకారాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

తుఫాను ప్రభావం వలన కురిసిన వర్షాలకు మండల పరిధిలో వాణిజ్య పంటలు ఎక్కువగా నష్టపోయాయని రైతులు తెలిపారు. వరి పంట అక్కడక్కడ నష్టపోయినది. ఇంకా వర్షాలు కురిసి నట్లు అయితే వరి పంటపై తీవ్ర ప్రభావం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు రెండు సార్లు వరి విత్తనాలు విత్తుకోవాల్సిది వచ్చినది దీనితో దాదాపు 20 రోజులు పైరు వెనుకబడి ఉన్నది ఆ ఆలస్యమే ప్రస్తుతం పంటను కాపాడినదని వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు తెలిపారు. చిలువూరు ప్రాంతంలో నిమ్మ తోటలలో పిందెలు కాయలు రాలిపోయాయి. కరకట్ట మీద తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో పడిన చెట్లను అధికారులు వెంటనే తొలగించారు మండలంలోని ఈమని గ్రామానికి చెందిన బుల్ల రవి ఇంటిపై చెట్టు కూలినది. వర్షాలు పూర్తిస్థాయిలో తగ్గేవరకు పునరావాస కేంద్రాలు కొనసాగిస్తామని తహశీల్దార్ ఐ.సునీత తెలిపారు. ఈమని గ్రామంలో కూటమి నాయకులు సహాయ సహకారాలతో పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి అన్ని రకాల సదుపాయాలు అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకపోవడం సంతోషకరమన్నారు. తక్షణ సహాయం కింద 3000 రూపాయలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినదన్నారు. వరికి గిట్టుబాటు ధర 2000 రూపాయలకి పైనే ఉంటుందని సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు ఎంపీటీసీ మరియు ఉప ఎంపీపీ పసుపులేటి సాయి చైతన్య సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఈమనిలోని పునరవాస కేంద్రంలో ఉన్నవారికి భోజనాలు వడ్డిస్తున్న చిల్లపలి



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

330 రోజులుగా సిమెంట్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్టపరంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 330 రోజులకు చేరుకున్నాయి. దీక్షలు కార్మికులు. ఎం.ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరావు, మల్లె గురవయ్య ప్రారంభించారు. దీక్షల్లో శంకురాత్రి రామారావు, వై.సాంబశివ రావు, రమాదేవి, ఈదులముడి శారమ్మా, బి.సూర్యప్రకాష్ కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం సిమెంట్ ఫ్యాక్టరీ విషయంపై స్పందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.స్టీవెన్, మేరుగ శేఖర్, దుర్గారావు, సిరిపల్లి పాల్గొన్నారు.



అల్పాహారం పంపిణీ చేస్తునన జనసేన నాయకులు

జనసేన ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు

జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం మరియు జిల్లా అధ్యక్షులు అయినటువంటి గాదె వెంకటేశ్వరరావు సూచన మేరకు ముందా తుఫాన్ కారణంగా ఆశ్రమం పొందినటువంటి తుఫాన్ బాధితులకు పొన్నూరు జనసేన పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తుఫాన్ నిర్వాసితులకు బుధవారం ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మున్సిపల్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణ అధ్యక్షులు అయినటువంటి షేక్ కరీముల్లా, పొన్నూరు మండల అధ్యక్షుడు అయినటువంటి నాగిసేటి సుబ్బారావు, గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి మేకల రామయ్య, వల్లంశెట్టి శ్రీధర్, సందు శివ కోటేశ్వరరావు, షేక్ హుస్సేన్, పఠాన్ ఆలీ, మాదాసు అప్పారావు, పత్తి సురేష్, రత్తయ్య, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు, భోజనం పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఒండు రోజులుగా తుపాను ప్రభావంతో పనులు కోల్పోయి, నిరాశ్రయులుగా మారిన 83 మంది పేదలకు ఎంటిఎంసీ పరిధిలోని రాధా రంగా నగర్‌లో ఏర్పాటుచేసిన పురావస కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బావినేని రూపు కుమార్ (నాని) శరణ్య దంపతుల సహకారంతో బుధవారం 40 కుటుంబాలకు, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో నిత్యవసర సరుకులను, భోజనాలు, అల్పాహారంను వడ్డేశ్వరం గ్రామ టిడిపి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, బావినేని రూప్ కుమార్, ఈవో ఎంఎల్వి ప్రసాద్, వీఆర్వో సుభాషిని, తాడేపల్లి మండల బీసీ సెల్ కార్యదర్శి కామినేని సాంబశివరావు, షేక్ ఇమాంస, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతోనే తుఫాన్ ప్రమాదం నుంచి తప్పించుకోగలిగాము తెనాలి సబ్ కలెక్టర్ సంజనసింహ


ఫోటో రైట్ అప్7.. పునరావాస కేంద్రంలోని బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంజనాసింహ

ప్రజాశక్తి - కొల్లిపర

తుఫాన్ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి అప్రమత్తంతో ఉండడం వలన ప్రమాదం నుంచి తప్పించుకోగలిగామని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ అన్నారు బుధవారం మండలంలోని తూములూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆమె సందర్శించారు. తూములూరు, వల్లభాపురం, హనుమాన్ పాలెం, దావులూరుపాలెం గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పునరావాస కేంద్రంలోని వసతులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు పునరావాస కేంద్రంలోని బాధితులతో మాట్లాడారు అక్కడ ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి మందుల అందుబాటులో ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమార్ తాసిల్దార్ సిద్ధార్థ ఎంపీడీవో విజయలక్ష్మి, డాక్టర్ నేహా రెడ్డి అధికారులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు



అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి శ్రీ నిత్య

అరటి తోటల పరిశీలన

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని బొమ్మువాని పాలెం, వల్లభాపురం, కొల్లిపర, తుములూరు గ్రామాలో తుపాను వల్ల పడిపోయిన అరటి తోటలను ఉద్యానశాఖ అధికారి శ్రీ నిత్య బుధవారం పరిశీలించారు. పసుపు, కూరగాయ తోటలు మిగిలిన పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపి వేసుకోవాలని రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు సచివాలయ హార్టికల్చర్ మరియు అగ్రికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటిని బయటికి పంపాలి

ప్రజాశక్తి - కొల్లిపర

తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల వలన మాగాని పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే రైతులు కాలువ ద్వారా బయటికి పంపాలని మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వల్లభాపురం, శివలూరు గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తక్షణమే బయటకు పంపి గాలికి వాలిపోయిన వరి పైరును నాలుగు లేదా ఐదు దుబ్బులను కలిపి కట్టి పైరును నిలబెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బోటు యార్డు దగ్గర ఇళ్లలోకి నీరు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని బోటు యార్డు దగ్గర పేదలు నివసిస్తున్న ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. గత రెండు రాత్రుల నుండి నిద్రలు కూడా పోవటం లేదని బాధితులు చెప్పారు. తుఫాన్ ప్రభావంతో పనులు లేక అర్ధాకలితో బతుకుతున్నామని వాపోయారు. ప్రభుత్వం వైపు నుండి ఇంత వరకు సాయం అందలేదని చెబుతున్నారు. ఎప్పుడు తుఫాను వచ్చినా తమకి తిప్పలు తప్పడం లేదని అసంతఅప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఇళ్లలోకి చేరిన నీరు



పునరావాస కేంద్రాలలో బాధితులతో మున్సిపల్ అధికారులు

కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు

పట్టణంలో ప్రమాదభరతంగా ఉన్న చెట్లు తొలగింపు - పునరావాస కేంద్రాలలో బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - తెనాలి

తుఫాను ప్రభావిత బాధితుల కోసం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. తుపాను ప్రభావంతో విరిగిపడిన చెట్లను మున్సిపల్ అధికారులు తొలగించారు. బుధవారం గాలి తీవ్రత తగ్గినా వర్షం పడుతూనే ఉంది. చెట్లు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు విద్యుత్ పునరుద్ధరణకు ఇబ్బంది లేకుండా ప్రమాద భరితంగా ఉన్న చెట్లను తొలగించారు. పట్టణంలోని తొమ్మిది పునరావాస కేంద్రాలను మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, మున్సిపల్ ఆరోగ్యాధికారి ఎం.యేసుబాబుతో కలిసి కమిషనర్ పరిశీలించారు. వైద్య శిబిరాలను కొనసాగిస్తున్నారు. సిబ్బందికి కమిషనర్ పలు సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుపాను వల్ల వీచిన గాలులకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. నందివెలుగు గుంటూరు రోడ్డులో బాపయ్యపేట వద్ద చెట్టు నడిరోడ్డుపై విరిగిపడింది. దేవీ చౌక్‌లో చెట్టు విరిగి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి తొలగించారు. విద్యుత్ వైర్లపై పడిన చెట్లను మున్సిపల్, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేసే తొలగించారు.

పునరావాస కేంద్రాలను పరిశీలించిన మలేరియా అధికారి

తుఫాను కారణంగా తెనాలి నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన పలు పునరావాస కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి టి.మురళీకృష్ణ బుధవారం పరిశీలించారు. కొలకలూరు, నంది వెలుగు, అత్తోట, తూములూరు, తెనాలి పట్టణంలో పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడ ప్రజలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారులు ఎస్.ఉమాకాంత్, వి.పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి ఎ.బాలచంద్ర మౌళి, తన ఎస్.శివగణేష్, డి.మల్లేశ్వరరావు, నవీన్ , వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుంది : ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - కొల్లిపర

తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని తూములూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రక్కల నివసించే వారిని పూరి గుడిసెల్లో నివసించే వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చి ప్రాణ నష్టం జరగకుండా భోజనం వసతులు ఏర్పాటు చేసిన ఘనత కూటమి నాయకులకే చెందుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిద్ధార్థ ఎంపీడీవో విజయలక్ష్మి, టిడిపి నాయకులు వంగాసామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు భీమవరం చిన్న కోటిరెడ్డి, కంచర్ల అమృతరాజు, కొల్లి కోటిరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపుప్రాంతాల్లో టీడీపీ నాయకులు

ప్రజాశక్తి- తాడేపల్లి

మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో తాడేపల్లి పట్టణ టీడీపీ నాయకులు బుధవారం తుఫాన్ ముంపు ప్రాంతాల్లో పర్యటించి సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డోలాస్‌నగర్, ప్రకాష్ నగర్, నులకపేట, రాయల్ పబ్లిక్ స్కూల్, ముగ్గురోడ్డు, సీతానగరం ప్రాంతాల్లోని ప్రజల వద్దకు వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. డోలాస్‌నగర్, ప్రకాష్ నగర్, నూలకపేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలేరియా అధికారి



తూములూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

లలితా హాస్పిటల్‌లో పక్షవాతంపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న డాక్టర్ విజయ

ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా బుధవారం గుంటూరు లోని లలితా హాస్పిటల్ ప్రాంగణంలో న్యూరో సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ పి.విజయ, న్యూరో ఫ్యాకల్టీ డాక్టర్ వీరమ్మ, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రేష్మ, డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ అజ్మా ఆధ్వర్యంలో పక్షవాతంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ 'పక్షవాతం విషయంలో ప్రతి నిముషం విలువైనదే' అనేది ఈ ఏడాది వరల్డ్ స్ట్రోక్ డే సందేశం అన్నారు. ఏ వయస్సులోనైనా, ఎప్పుడైనా పక్షవాతం ముఖ్యమైనదని, పక్షవాతం ప్రారంభమైన ప్రతి నిముషానికి సుమారు 20 లక్షల మెదడు క్షణాలు చనిపోతాయని, అంటే ఒక గంటలో మూడు సంత్సరాల వయస్సు పెరిగినంత నష్టం మొదడుకు జరుగుతుందన్నారు. కాబట్టి తక్షణ చర్య చాలా అవసరం అని తెలిపారు. పక్షవాతానికి నిర్దిష్టమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. గోల్డెన్ అవర్ అయిన మొదటి నాలుగు గంటన్నరలో రోగిని స్ట్రోక్ రెడీ హాస్పిటల్‌కు తీసుకెళితే, సిటి స్కాన్ చేసి, పక్షవాతం రకం నిర్ధారించి, రక్తం గడ్డ గట్టడం వల్ల ఇస్కిమిక్ స్ట్రోక్ అయితే థ్రోంబోలైటిక్ థెరపి ద్వారా రక్తం గడ్డ కరిగించే మందు ఇచ్చి, సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. గోల్డెన్ అవర్ నాలుగున్నర గంటలు మాత్రమని, కాబట్టి పక్షవాతం లక్షణాలను వెంటనే గుర్తించి, తక్షణమే సిటి స్కాన్, న్యూరాలజిస్ట్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉన్న స్ట్రోక్ రెడీ హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని, ఆలస్యం అయితే మెదడు నష్టం పెరిగి, శాశ్వత అంగవైకల్యం సంభవిస్తుందన్నారు. పక్షవాతం నివారణకు ప్రతి రోజూ కనీసం 30 నిముషాలు నడక, లేదా వ్యాయామం చేయటం, బిపి, షుగర్ నియంత్రణలో ఉంచుకోవటం, ధూమపానం, మద్యపానం మానుకోవటం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవటం, బ్లడ్ కొలస్ట్రాల్ తగ్గించుకోవటం, ధ్యానం, యోగా వంటి పద్ధతుల ద్వారా మానసిక ఒత్తిడి తగ్గించుకోవటం ముఖ్యమని సూచించారు.స్ట్రోక్ సర్వైవర్స్, కేర్ గివర్స్, సాధారణ ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ కాలేజి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు

దుప్పట్లు పంపణీ చేసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని ఆత్మకూరు గ్రామంలో వరద బాధితుల పునరావస కేంద్రాలను యుటిఎఫ్ నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి కళాధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలను తక్షణం విడుదల చేయాలి

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి మంగళగిరి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి

ఎస్సీ కార్పొరేషన్ లోన్లు తక్షణం విడుదల చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మంగళ గిరి టిప్పర్ల బజార్‌లోని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) కార్యాలయంలో నాయకులు గోనే లూథర్ పాల్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.సమావేశంలో మాల్యాద్రి మాట్లాడారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎస్సీల ఆర్థికాభివృద్ధికి కావాల్సిన ఎస్సీ కార్పొ రేషన్ నిధులను విడుదల చేయడంలో ఆలస్యం చేస్తోందని విమర్శించారు. వేలాది మంది ఎస్సీలు లోన్ల కోసం దరఖాస్తు చేసినా, వాటిని ఇంకా విడుదల చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. అలాగే, ఎన్నికల హామీగా ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వృద్ధాప్య పెన్షన్లను 50 సంవత్సరాలు దాటిన వారందరికీ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ బ్యాక్లాగ్ పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం చూపుతోందని, ప్రమోషన్లలో ఎస్సీలకు ఇవ్వాల్సిన రిజర్వేషన్ నిబంధనలను పాటించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సరైన వేతనాలు ఇవ్వకపోవడం వల్ల వారు ఆకలితో అలమటిస్తున్నారని ఆయన తెలిపారు. విజయ వాడలోని అంబేద్కర్ స్మృతి వనం అభివృద్ధికి మరియు నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించక పోవడం తీవ్ర నిర్లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులకు ఏడాదిన్నరగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో జరగాల్సిన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరగకపోవడం వల్ల ఎస్సీలపై దాడులు, దళితుల అభివృద్ధి అంశాలపై చర్చ జరగడం లేదని ఆయన విమర్శించారు. తక్షణమే ఈ కమిటీలను ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమా వేశంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు విజయరాజు, కోటేశ్వరరావు, సుందర్ బాబు, స్వామినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను అనంతర చర్యలు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-గుంటూరు

తుపాను అనంతర చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. తుపాను అనంతర చర్యలపై సంబంధిత అధికారులతో బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశుధ్యం లోపం లేకుండా చూడాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలలోనూ పారిశుధ్య పనులు కొనసాగాలని స్పష్టం చేశారు. ఎక్కడా నీరు నిలువ ఉండ కుండా చూడాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించాలని,. కాజ్‌వేల వద్ద నిరంతర పర్యవేక్షణ జరగాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణ త్వరగా జరగాలని, రహదారులపై చెట్లు పడి పోయి ఉంటే తొలగింపు వేగవంతం చేయాలని, తుపాను రీత్యా ఏర్పడిన ఇబ్బందులు ప్రజలు చెప్తే వాటికి ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం పనిచేయడాన్ని అభినం దించారు. వసతి గృహాలు, పాఠశాల భవనాలు వర్షానికి బాగా తడిసి ప్రమాదకరంగా ఉండవచ్చని, తడిగోడలు విద్యుత్ ప్రవాహానికి కారణం కావచ్చని, వాటిని జిల్లా విద్యా శాఖ అధికారి, సంక్షేమ శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించి సురక్షితంగా ఉన్నాయని నిర్ధారణ అనంతరం మాత్రమే విద్యార్థులను అనుమతిం చాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సిఎం ఆదేశించారన్నారు. పునరా వాస కేంద్రాలలో తొమ్మిదివేల మంది ఉన్నారని, వారికి నిత్యావసర సరుకుల కిట్లు సిద్ధం చేయాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి ఒక వ్యక్తికి రూ.వెయ్యి చొప్పున నగదు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు అన్నారు. అయితే ఒక కుటుంబం నుండి ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది ఉన్నప్పటికీ గరిష్ఠంగా మూడు వేలు మాత్రమే చెల్లించాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు తమ మండలాల్లో చేపట్టిన పునరుద్ధరణ పనులు వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయి కుమార్ పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. టెలి కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ ఎన్ఎస్‌కె.ఖాజావలి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట.. రైతు గుండె కోత..

పునరావాస శిబిరంలోని వారికి రూ.3 వేలు ఆర్థికసాయం, నిత్యావసరాలు : కలెక్టర్

ప్రజాశక్తి - పెదనందిపాడు

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల పెదనందిపాడు మండలంలోని నక్క వాగు, మేకల వాగు పొంగడంతో కొప్పర్రు, అన్నపర్రు, వరగాని గ్రామాలను వరద ముంచెత్తింది. పత్తి, మిరప, సోయా చిక్కుడు, మినుము తదితర పంటలు పూర్తిగా నీట మునిగాయి. అబ్బినేని గుంట పాలెం వద్ద గుంటూరు పర్చూరు రోడ్డు మీదగా వరద పారింది. వరగాని వద్ద చప్టా, పెదనందిపాడు దాటిన తర్వాత పేట చప్టా పొంగటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వరగాని గ్రామంలోని ఎస్టీ కాలనీలో లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి నీరు చేరింది. వారికి స్థానిక ఎంపీపీ పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేశారు. పెదనందిపాడు ఒకటి, రెండు వార్డులలో డ్రైనేజీ పొంగి రోడ్లమీద మోకాళ్ళ లోతు నీరు చేరింది. నాగులపాడు అంబేద్కర్ నగర్, ఎస్టీ కాలనీలలోకి డ్రైనేజీలు పొంగి రోడ్లమీద ప్రవహించడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో బుధవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పర్యటించారు. ఏబీ పాలెం వద్ద రోడ్డు పొంగడంతో ట్రాక్టర్ పై ప్రయాణిస్తూ ఆమె వరద ప్రభావాన్ని పరిశీలించారు. పెదనందిపాడు ఎస్సీ హాస్టల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్నవారికి స్వయంగా భోజనం వడ్డించారు. నల్లమడ వాగు కట్టమీద నివాసం ఉంటున్న ప్రజలు ఎప్పటినుంచో గత్యంతరం లేక అక్కడ గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని, తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు. ఆమె సానుకూలంగా స్పందించారు. దెబ్బతిన్న పంటలకు వ్యవసాయ అధికారులతో నష్టం అంచనా వేయించి పరిహారం అందించేలా చూస్తామన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి సాధారణ పరిస్థితులు నెలకొని వారు ఇళ్లకు వెళ్లేటప్పుడు కుటుంబానికి రూ.3,000 ఆర్థిక సహాయం, నిత్యవసర వస్తువులు అందిస్తామని తెలిపారు. అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలలో పాల్గొన్న అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కాకుమాను మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పరిశీలించారు. కాకుమాను పిఎసిఎస్ లో ఉన్న నానో యూరియా, యూరియా నిల్వలను పరిశీలించారు. కొల్లిమెర్ల లాకులను పరిశీలించారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. వారి వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, కాకుమాను మండల తహశీల్దార్ బి వెంకటస్వామి, మండల అధికారులు ఉన్నారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

మొంథా తుపాను ప్రభావంతో నిత్యం రద్దీగా ఉండే ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరు రోడ్డు కూడలి ప్రాంతం నిర్మానుషంగా మారింది. బలమైన వీధురూ గాలులతో, భారీ వర్షంతో జనజీవనం ఎక్కడికక్కడే స్తంభించిపోయింది. చిరు వ్యాపారుల సైతం వ్యాపారాలు లేక గత రెండు రోజులుగా విలవిలలాడుతున్నారు. బుధవారం తెల్లవారుజాము నుండి ఎడతెరిపిలేని వర్షం, బలంగా గాలులతో కూడిన వర్షపాతం నమోద యింది. దీంతో రోడ్డుకి ఇరువైపులా షాపులు మూతపడ్డాయి. మండలం లోని వివిధ గ్రామాలలో పంట పొలాలలో వర్షపునీరు అధికంగా చేరింది. పసుపు, కంద, అరటి, ఆకుకూరల మడులలో వర్షపు నీరు అధికంగా చేరి, పంటలు నీట మునిగాయి. గడిచిన రెండు నెలల నుండి ఇప్పటికీ 5, 6 సార్లు వర్షం పడడంతో కౌలు రైతులు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి, పంటలు తీవ్రంగా నష్టపో యే పరిస్థితి ఏర్పడింది. రైతన్నల కంట వర్షపు నీరే మిగి లిందని పలువురు రైతులు వాపో తున్నారు.


నరసరావుపేటలో బరంపేట వద్ద ఉధృతంగా వస్తున్న ప్రవాహం


దుగ్గిరాలలో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న రైతు


యడ్లపాడు మండలం తిమ్మాపురం జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద నిలిచిన వర్షం నీరు


కొప్పర్రు గ్రామంలో పత్తి పంట లోకి చేరిన వరద నీరు


కుంచనపల్లి గ్రామంలో నీట మునిగిన ఆకుకూరల మడులు


తుపాను దాటికి నేలకొరిగిన కంద పంట


తాడేపల్లి మండలంలో నీట మునిగిన పసుపు పంట

మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు

- బలంగా వీస్తున్న ఈదురు గాలులు
- పొంగిపోర్లుతున్న వాగులు, కాలువలు
- విద్యుత్ సరఫరా నిలిపివేత



పరిస్థితిని సమీక్షిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - రొంపిచర్ల

వొంథా తుఫాన్ ప్రభావం వలన మండలంలో కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురుస్తున్నాయి. మొంథా తుఫాన్ తీరం దాటడం వలన మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు తోడు బలంగా ఈదురు గాలులు వీస్తున్నాయి. ఈదురు గాలులు, భారీ వర్షాలు వలన మండలం లో అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఈ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండలంలో పలు గ్రామాల్లో వాగులు, చెరువులు, కాలువలు పొంగిపోర్లాయి. మండలంలో మాచవరం గ్రామంలో గల చప్టా మీదుగా ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీని వలన ఆయా గ్రామాల మీదుగా వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఆ దారిలో వాహనాలు వెళ్ళకుండా పోలీసులు రోడ్డు మీద ముళ్ళ కంపలు అడ్డు వేశారు. అదే విధంగా మండలంలో అన్నవరం, మునమాక గ్రామాల్లోని బ్రిడ్జిల అంచు తగులుతూ ఓగేరు వాగు ప్రవహిస్తుంది. మండలంలో ఎడ్వర్డ్ పేట, కొత్తపల్లి, విప్పర్ల, వి.రెడ్డిపాలెం గ్రామాల్లో రైతులు సాగు చేస్తూ, ఏపుగా పెరిగిన వరి కిందకు వొంగిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మిర్చి పంట నీట మునిగింది. మండలంలో అచ్చయ్యపాలెం, అలవాల గ్రామాల్లో గల పనులు లేక ఇబ్బందులు పడుతున్న వలస కూలీలను రెవెన్యూ అధికారులు రిలీఫ్ క్యాంపునకు తరలించారు. వారికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తుఫాన్ ప్రభావం వలన మండలంలో ఎటువంటి నష్టం సంభవించకుండా తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. మండలంలో ఉధతంగా ప్రవహిస్తున్న వాగులు వద్ద వాహనాల రాకపోకలు నిలిపివేస్తూ పోలీసులు ప్రమాద హెచ్చరికలు జారీ చేయడం జరిగింది.

వంతెన నిర్మించండి

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలోని మాచవరం నుండి బెహరావారి పాలెం మధ్యలోని వంతెన నిర్మాణం చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ అన్నారు. తుఫాను కారణంగా ఆ వంతెనపై ఒగేరు వాగు ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను రమేష్ కుమార్ తెలుసుకొని మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో ఈ వంతెన నిర్మాణం చేపట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కు నరసరావుపేట ఎంపీకి నరసరావుపేట ఎమ్మెల్యేకి వినతి పత్రాలు అందించామని వీలైనంత త్వరగా వంతెన నిర్మాణం చేపట్టి ప్రజల సమస్యలను తీర్చాలని వేడుకున్నామని తెలిపారు. సుమారుగా 10 గ్రామాల నుండి ప్రజలు ఆ రహదారి మీదుగా వెళుతుంటారని ముఖ్యంగా రెడ్డిపాలెం మోడల్ స్కూలు, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నిత్యం ఇదే రహదారిలో వెళ్లాలని ఒకసారి వర్షం పడితే వాగు ప్రవాహం ఎక్కువై వంతెనపై నుంచి నీరు ప్రవహించి స్కూళ్లకు కాలేజీలకు వెళ్లలేని పరిస్థితి. రెడ్డిపాలెం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నా ఈ వాగు ప్రవాహం ఎక్కువ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఈ ఘటనపై స్పందించి పల్నాడు జిల్లా కలెక్టర్, నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే వంతెన నిర్మాణానికి కృషి చేయాలని రమేష్ కుమార్ తెలిపారు.

అధికారులు, కూటమి నాయకులతో సమన్వయం

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

మొంథా తుపాన్ కారణంగా పట్టణంలోని వరద ఉధృతి ఎక్కువగా ఉన్న యరపతినేనినగర్, రిక్షా కాలనీ, రజక కాలనీ, బుడం జంగాల కాలనీలలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు అధికారులు, కూటమి నాయకులతో సమన్వయం చేస్తున్నారు. వరద ఉధృతి తగ్గించే విధంగా జెసిబితో గండి కొట్టిస్తూ వరద వలన కూలికి వెళ్లలేక ఇబ్బంది పడుతున్న బుడం జంగాల కాలనీవాసులకు బియ్యం, కూరగాయలు, కంది పప్పు వంటి నిత్యావసర సరుకులని కూటమి నాయకుల ద్వారా పంపిణీ చేస్తామని కూటమి పార్టీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకొని నిత్యావసర సరుకులు అందించిన శ్రీనివాసరావుకి కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. కూటమి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు అధికారులు, కూటమి నాయకులతో మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేయాలని, సహాయ కార్యక్రమాలలో పాల్గొనేలా నాయకు లను భాగస్వామ్యం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న జనసేన కార్యకర్తలు

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని జాగుపాలెం ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 40కుటుంబాలకు నియోజక వర్గ జనసేన నియో జకవర్గ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ రూ. 20వేల విలువైన నిత్యావసరాలు, కూరగాయలు, దుప్పట్లను పంపిణీ చేశారు. నియోజ కవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ సేవే లక్ష్యంగా జనసేన పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, భవిష్యత్తులో ఇలాంటి సేవలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో 25వార్డు కౌన్సిలర్ తోట నాగలక్ష్మి, సురేష్, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - వినుకొండ

మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విస్తృతంగా పర్యటించారు. పునరావాస కేంద్రాలు, లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో పర్యటించి బాధితులకు అందుతున్న సహాయ కార్యక్రమాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. తుపాను బాధితుల కోసం వినుకొండ నిర్మల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆంజనేయులు పరిశీలించారు. పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లపై బాధితు లను అడిగి తెలుసుకున్నారు. వసతి పొందుతున్న ప్రజలతో మాట్లాడి ఆహారం, సౌకర్యాలపై ఆరా తీశారు. పునరావాస కేంద్రంలో ఆహారం, తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు ధైర్యం చెప్పారు. తుపాను ప్రభావంతో పలుచోట్ల గుడిసెలు, మట్టి మిద్దెలు కూలిపోయాయని, వారందరిని ఎన్డీఏ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వరి, మొక్కజొన్న, మిర్చి, పత్తి, పొగాకు, కంది సాగుచేసిన రైతులు నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

200 కుటుంబాలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు ఆ కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు కూటమి నాయకులు,అధికారులు పాల్గొన్నారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా వినుకొండ పట్టణంలోని కాలువ కట్ట ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ తుఫాన్ ధాటికి అనేక విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఒక ట్రాన్స్ ఫార్మర్ కూడా దెబ్బతింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆంజనేయులు స్పందించి తక్షణమే మరమ్మతుల నిమితం విద్యుత్ అధికారులను ఆదేశించారు. చేపడుతున్న పనులను ఆయన నేరుగా వెళ్లి పర్యవేక్షించారు.

మందులు, ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి

మొంథా తుఫాను కారణంగా నిరాశ్రాయులైన షుమారు 250 మంది 3వ వార్డ్ వావిలాల ఘాట్ ప్రాంత ప్రజలకు సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆహారం, మందులు అందజేశారు. నిరాశ్రాయులైన షుమారు 100 మంది 31వ వార్డ్ అంబేద్కర్ నగర్ వాసులకు దుప్పట్లు అందజేశారు.

బస్సులు నిలిపివేసిన ఆర్టీసీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తుఫాన్ కారణంగా ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. వివిధ రూట్లలో రెగ్యులర్‌గా తిరిగే బస్సులను అరకొరగా తిప్పడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పల్నాడు జిల్లాలో 430 బస్సులు గాను 266 బస్సులు మాత్రమే నడిపారు. సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో 60 బస్సులు గాను వివిధ రూట్లో 35 బస్సులు తిప్పి 25బస్సులను నిలిపివేశారు. గుంటూరు డిపో బస్సులు పూర్తిగా నిలిపివేయడంతో గుంటూరు నుంచి మాచర్ల వెళ్లే ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఆక్యుపెన్సీ ఉండదనే కారణంతో బస్సులు నిలిపివేయడంతో ప్రయాణికులు ఆర్టీసీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి విరిగి పడిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - రెంటచింతల

మేజర్ పంచాయతీ రెంటచింతలలోని చర్చీ సమీపంలో విద్యుత్ స్తంభం విరిగి పడింది. ప్రమాదం నుంచి బస్సు ఎక్కబోయే ప్రయాణీకులు తప్పించుకున్న సంఘటన బుధవారం వేకువ జామున జరిగింది. ఆర్అండ్‌బి ప్రధాన రహదారికి దగ్గర్లో వున్న సిమెంట్ స్తంభంపై చెట్టు విరిగి తీగల మీద పడడంతో స్తంభం సీసీ రోడ్డు మీద పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ మస్తాన్ వలి నేతృత్వంలో సిబ్బంది నూతన స్థంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్‌ను రెండు గంటల వ్యవధిలో పునరుద్ధరించారు.

మొంథా తుఫాన్ నేపథ్యంలో భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా రెంటచింతల మండలం పరిధిలో ఉన్న పాలువాయి పిల్లి వాగు, పశర్లపాడు, గోలి గ్రామాల్లో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలు వాగులను తహశీల్దార్ మేరీ కనకం పరిశీలించారు. ఆమె వెంట ఆర్ఐ మన్ మోహన్ ప్రసాద్ ,సచివాలయ సిబ్బంది ఉన్నారు. తుమకోట ,పశర్లపాడు వాహనాల రాకపోకలు నిలిపివేశారు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

మొంథా తుఫాన్ నేపథ్యంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండల కేంద్రమైన రెంటచింతలలో ఉన్న వై ఆర్ ఎస్ ఉన్నత పాఠశాలలో బుధవారం తుఫాన్ బాధితుల కోసం ముందస్తు చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, ఇంచార్జ్ డిప్యూటీ ఎంపిడిఓ బాబు లాల్, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్ రెడ్డి, దగ్గరుండి పర్యవేక్షించారు.

గర్భిణులను వైద్యశాలకు తరలింపు

ప్రజాశక్తి - రాజుపాలెం

మండలంలోని బ్రాహ్మణపల్లి, చౌటపాపాయపాలెం గ్రామాలలో గర్భిణీలను గుర్తించి వారి బంధువులతో డాక్టర్ రవితేజ మాట్లాడారు. ప్రభుత్వం వైద్యశాలకు 104 వాహనంలో తరలించారు. డాక్టర్ రవితేజ మాట్లాడుతూ గర్భిణీలకు 24 గంటలు వైద్యుల సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాజుపాలెం మండలంలోని గణపవరం, కొత్తూరు, చౌట పాపాయపాలెం సచివాలయంలో రాజుపాలెం వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులను పల్నాడు జిల్లా ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రామ్ ఆధికారి డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ రవితేజ పర్యవేక్షించారు. కార్యక్రమంలో వసంతరావు ఉషారాణి, కరీముల్లా, అలేఖ్య, ప్రమీల, సరళ, సుజాత పాల్గొన్నారు.

రజక కాలనీలోకి నీళ్లు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

నియోజకవర్గంలోని పలుమండలాలలోని మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాలను గురజాల మాజీ శాసనసభ్యుల కాసు మహేష్ రెడ్డి సందర్శించారు. మండలంలోని చర్లగుడిపాడు గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి ప్రభు త్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు, కౌలు రైతులకు పంటల బీమా చెల్లించాలని అన్నారు. దాచేపల్లి పట్ట ణంలోని కాటేరు వాగును పరిశిలించారు. 27వ వార్డులోని రజక కాలనీలో వరద నీరు మోకాలి వరకు నిల్వ ఉండిపోయిందనీ, ఈ కాలనీ నుండి వచ్చే పోయే కాలువలు కూటమి పార్టీ నాయకులు ఆక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్లే నీరు చేరిందని అన్నారు. అధికారుల ఇప్పటికైన స్పందించి ఆక్రమణలు తొలగిస్తే ప్రజలకు వరద వల్ల కలిగే ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

అన్నార్తుల ఆకలి తీర్చండి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు, ఆకలిగా ఉన్న వారి కడుపు నింపటమే జన చైతన్య సమితి లక్ష్యమని సంస్థ కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. పెదకూరపాడుకు చెందిన గుడిపూడి శివకృష్ణ, ఓల్గా వినూత్న దంపతుల కుమారుడు తారక్ అయాన్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో జన చైతన్య సమితి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గుంటూరు ప్రభుత్వ వైద్యశాల వద్దకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగుల సహాయకులకు, రోడ్డు పక్కన జీవించే నిరాశ్రయులు యాచకులకు, బుధవారం ఉదయం భోజనాలను ఏర్పాటు చేశారు. సాంబశివరావు మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా భోజనానికి ఇబ్బంది పడే వారికి భోజనం సమకూర్చటం అభినం దనీయమన్నారు. జనచైతన్య సమితి బందం ప్రతినిధులు బెజ్జం నాగేశ్వరరావు,దాసరి కారుణ్య బాబు, గోగులపాటి సజీవ్ రూప్ పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

భారీగా వర్షాల కారణంగా మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని గౌరమ్మ ఇల్లు కుప్ప కూలింది. మాచర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించి నిరాశ్రయులైన గౌరమ్మ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసి పునరావాస కేంద్రానికి తరలించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని బాధితులకు తహశీల్దార్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనును రక్షించిన పోలీసులు

వ్యక్తిని రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కష్ణా నదిలో చేపలు పట్టడానికి వెళ్ళిన పరసగాని శ్రీనును పోలీసులు రక్షించారు. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం వెల్లటూరు గ్రామం శ్రీరామ్‌నగర్ కాలనీ చెందిన శ్రీను మిషన్ బోటు సహాయంతో జాలర్లతో కలసి కృష్ణా నదిలోకి వెళ్లాడు. మంగళవారం రాత్రి చేపలవేట ముగించుకొని తిరుగు ప్రయాణంలో తన బోటు మిషన్ చెడిపోవడంతో దగ్గరలోని చిన్న ఒడ్డు ప్రాంతానికి చేరుకున్నాడు. తుపాను తీవ్రత కారణంగా ఎటూ వెళ్లలేక దిక్కుతోచని స్థితిలో ఉండగా బుధవారం ఉదయం బెల్లంకొండ ఎస్సై డి. ప్రవీణ్ కుమార్‌కు అందిన సమాచారంతో సత్తెనపల్లి డిఎస్.పి ఎం.హనుమంతరావు, పెదకూరపాడు సర్కిల్ సిఐ పి.సురేష్ పర్యవేక్షణలో సిబ్బందితో కలిసి జాలర్ల సహాయంతో రక్షించి, బంధువులకు అప్పగించారు. ప్రజల ప్రాణ రక్షణ కోసం పోలీసు సిబ్బంది చూపిన ధైర్యసాహసాలు పోలీసు అధికారులను పల్నాడు జిల్లా ఎస్.పి బి.కష్ణారావు అభినందించారు.



తుపాను ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మెంథా తుపాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం, శివారు ప్రాంతాలు భారీ వర్షం కారణంగా నీట మునిగాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 10 గంటల వరకు తుపాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో భారీ వర్షం కురిసింది. దీంతో కొంతమేర విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రాత్రి సమయంలో భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న గృహాల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పట్టణ శివారులో బీసీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, సాయి నగర్ కాలనీ, లింగంగుంట్ల గ్రామంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ప్రకాష్ నగర్ సమీపంలో గల లింగంగుంట్ల కాలనీలో గృహాల్లోకి నీరు చేరుకోవడంతో ప్రజలు ఆందోళన చెందారు. బుధవారం తెల్లవారుజామున వర్షపు నీరు భారీగా గృహాల్లోకి రావడంతో ప్రజలు దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొన్నారు. ఇంట్లో గల వస్తువులు నీటిలో తేలియాడుతూ కనిపించాయి. సచివాలయ సిబ్బంది కూడా సమయానికి ఎవరూ రాలేదని ఆయా ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

శిరిగిరిపాడు పునరావస కేంద్రంలో ముమ్మర చర్యలు..!

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల పరిధిలోని మొంథా తుపాను బీభత్సం సృష్టించింది. వాగులు వంకలు పొంగిపొర్లాయి. దాదాపు 10 గ్రామాల ప్రజలు రాకపోకలు స్తంభించాయి. ప్రజలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా, వారిని సురక్షితంగా పునరావస కేంద్రాలకు తరలించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులను బుధవారం ఆదేశించారు. శిరిగిరిపాడు చెరువు పరిధిలోని పరిశర ప్రాంత గ్రామాలను ఆయన సందర్శించి, పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం శిరిగిరిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని ఎమ్మెల్యే జూలకంటి సందర్శించి, సౌకర్యాలను సమీక్షించారు. అక్కడ ఉన్న ప్రజలకు తాగునీరు, ఆహారం, చిన్నారులకు అల్పాహారం , మందులను అందజేశారు. వరద బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారుకులకు, కూటమి పార్టీల నాయకులకు సూచించారు వెల్దుర్తి మండలం పట్లవీడు గ్రామానికి ఒకపక్క చెరువు నిండు అలుగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాహనాలు రాకపోకలు అంతరాయం కలిగింది. అదేవిధంగా గ్రామానికి మరొక ప్రక్క వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల గ్రామానికి వీధుల వెంట నీరు ప్రవహిస్తుంది. సమస్య పరిష్కారానికి పట్లవీడు-ఎర్రబాలెం మధ్యన ఉన్న లో లెవెల్ బ్రిడ్జిని ఐ లెవెల్ బ్రిడ్జిగా మార్పులు చేసినట్లయితే గ్రామానికి నీరు ఉధృతి తగ్గుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు.





ఆహార పొట్లాల పంపిణీలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి

సహాయక చర్యల్లో నిర్లక్ష్యం : వైసిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పర్యటించి ప్రజలకు పులిహార పొట్లాలు, మంచినీరు పంపిణీ చేశారు. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీ, బరంపేటలో పర్యటించిన డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ తుపాను సహాయక చర్యలను చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ పదే పదే చేసిన హెచ్చరికలను నరసరావుపేట ప్రభుత్వ యంత్రాంగం బేఖాతరు చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు కాలనీ వద్ద ఉన్న వాగు పొంగి కాలనీలో 10 లైన్లు, బరంపేటలోని 4 లైన్లు, స్టేడియం నీట మునిగి పోయినా ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్య వైఖరిని అవలంబించిందన్నారు. తుఫాను సహాయక చర్యల్లో నరసరావుపేట ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. నీట మునిగిన చంద్రబాబు నాయుడు కాలనీలో ప్రజలు ఆహారం వండుకునే పరిస్థితి లేదని, మున్సిపల్ అధికారులు నామమాత్రంగా కూడా స్పందించలేదని ఆరోపించారు. మధ్యాహ్నం సమయానికి కూడా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, మంచి నీరు సరఫరా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహారం, మంచి నీరు సరఫరా చేయలేని దుస్థితిలో ప్రభుత్వ యంత్రాంగం ఉందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తుఫాను ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారే కానీ ఎటువంటి సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయటం వల్లనే తుఫాను బాధిత ప్రాంతాలలో సహాయక చర్యలకు అంతరాయం కలిగిందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలిపోయిన చింత చెట్టు

ప్రజాశక్తి కారంపూడి

తుపాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కారంపూడి పట్టణంలోని ఎన్‌టీఆర్ బొమ్మ సెంటర్ వద్ద బుధవారం తెల్లవారుజామున పెద్ద చింతచెట్టు కూలి చిరు వ్యాపారుల సముదాయాలపై పడింది. ఈ ప్రమాదంలో ఒక ఇల్లు, రెండు షెడ్లు మూడు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ ఘటన విషయం తెలుసుకున్న రాష్ట్ర టిడిపి నాయకుడు పంగులూరి అంజయ్య, పట్టణ మాజీ అధ్యక్షుడు కటికల. బాలకృష్ణ, సీనియర్ నాయకుడు మస్తాన్ జానీ, మహిళా నాయకురాలు కాటంరెడ్డి. నాగలక్ష్మి రెడ్డి, సర్పంచి సరస్వతి భాయ్ బాలునాయక్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. పంగులూరి.అంజయ్య మాట్లాడుతూ దెబ్బతిన్న ఇళ్లకు బదులుగా గ్రామ శివారులో స్థలాలు కేటాయించి వారికి కొత్త ఇళ్ల కట్టించేలా ప్రతిపాదనలు పంపుతాం అని ఆయన తెలిపారు. జరిగిన ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలలో నలుగురు అనాథ పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. సమస్యను ఎంపి, ఎమ్మెల్యే సాయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వారికి ప్రభుత్వ స్థాయిలో సాయం అందేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు అన్ని విధాలుగా వారికి సహాయం అందించడానికి కృషి చేస్తామని నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు రూ.10,000 తక్షణ సాయం, సరుకులు, వంట సామాగ్రి అందజేశారు.వర్షాల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని పంగులూరి అంజయ్య ప్రజలను కోరారు.

వరద ప్రభావిత ప్రాంతంలో సిపిఎం నాయకుల పర్యటన

పాలకుల వైఫల్యం... అక్రమ ఆక్రమణల నేపథ్యంలో ముంపు ప్రభావం...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాలకుల వైఫల్యం అక్రమ ఆక్రమణల నేపథ్యంలో మెంథా తుపానుతో వర్షపు నీరు ఇళ్ల లోకి చేరిందని సిపిఎం 1వ పట్టణ కార్యదర్శి షేక్.సిలార్ మసూద్ మండిపడ్డారు. తుపాను ప్రభావిత ప్రాంతాలైన సత్తెనపల్లి రోడ్డు స్టేడియం, చంద్రబాబు నాయుడు కాలనీ,భరంపేట, గుంటూరు రోడ్డు లో బుధవారం సిపిఎం సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, నరసరావు పేట మండల కార్యదర్శి డి.శివ కుమారి పర్యటించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ ఒక వైపు ఆక్రమణలు, మరో వైపు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న నేపథ్యంలో వర్షపు నీరు ఇళ్ల లోకి రోడ్డు పైకి చేరిందన్నారు. నరసరావు పేట పట్టణం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించడం, పెరిగిన జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించి పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టాలని బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

రేపు తుళ్లూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి - తుళ్లూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సిఆర్‌డిఎ సౌజన్యంతో అక్టోబర్ 31, ఉదయం 10 గంటల నుంచి రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలోని స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. జాబ్ మేళాను ఈ నెల 29న నిర్వహించాల్సి ఉండగా, మొంథా తుపాన్ కారణంగా ఈ నెల 31కి వాయిదా వేయడం జరిగింది. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు ఆయా గ్రామంలోని సి ఆర్ డి ఎ ఫెసిలిటేటర్ లేదా 9963425999 నెంబర్లలో కాల్ చేయవచ్చు.జాబ్ మేళాలో పాల్గనేవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నైపుణ్యం పోర్టల్ https://naipunyam.ap.gov.inలో నమోదు చేసుకొనవలెనని సిఆర్‌డిఎ కమిషనర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

దెబ్బతిన్న పంటపొలాలు పరిశీలన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్ విజయబాబు సందర్శించారు. మండల వ్యవసాయ అధికారి కె సుధీర్ బాబు తో కలసి దెబ్బతిన్న వరి పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పొట్ట దశనుంచి పాలుపోసుకునే దశలో ఉన్న వరిపైరు సుమారు 2752 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా ఉందన్నారు. గింజ రంగు మారడాన్ని నివారించడానికి, పాము పొడ, కాటుక తెగులు వ్యాప్తిని అరికట్టడానికి ప్రాపికోనజోల్, హెక్సాకోనజోల్ పిచికారి చేయాలన్నారు. వర్షపు నీరు తొలిగించిన అనంతరం ఎకరాకు 20 కేజీలు యూరియా, 15 కేజీలు పొటాష్ ఎరువులను బూస్టర్ డోసుగా పిచికారీ చేయాలన్నారు. ఇలా చేయడంద్వారా పంట పెరుగుదలకు దోహదపడు తుందన్నారు. పొలాల్లో నీరు త్వరగా బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమయానికి శిలీంద్ర నాశినాలను స్ప్రే చేయడం ద్వారా గింజ నాణ్యతను కాపాడుకోవడంతోపాటు సమతుల్య ఎరువులు, మురుగునీటి నిర్వహణ ద్వారా నీటమునిగిన, వాలిపోయిన పంటను పునరుద్ధరించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ప పి మురళి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్ మహాలక్ష్మి, వివిఎ లు అల్ఫీ, శివ సత్యం బాబు నీటిసంఘం ప్రెసిడెంట్ ఈదర బాబు గారు, రైతులు వెలగపూడి శ్రీహర్ష తదితర రైతులు పాల్గన్నారు.



సాగర్ 4 క్రస్ట్ గేట్లు ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి చేరిక కొనసాగుతుండటంతో బుధవారం నాడు 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 4 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి 32,232 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 39,707 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడ నుంచి మొత్తం ఔట్ ఫ్లో 65,077 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 32845 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 589.60 అడుగులు కాగా ఇది 310.8498 టీఎంసీలకు సమానం.

నలుగురు దారిదోపిడీ దొంగలు అరెస్టు

పరారీలో ఇరువురు దొంగలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రాత్రి సమయంలో దారి కాచి ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని కత్తితో బెదిరింపులకు పాల్పడి దోచుకుంటున్న 4 దొంగలను రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు నరసరావుపేట డి.ఎస్.పి ఎం.హనుమంత రావు బుధవారం తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డి.ఎస్.పి మాట్లాడుతూ ఈ నెల 25న రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామానికి చెందిన సాంబశివరావు వ్యక్తిగత పనులపై వడ్లమూడి వారిపాలెం వెళ్లి రాత్రి సమయంలో రొంపిచర్ల వస్తుండగా మార్గం మధ్యలో దేవరకొండ భవాని ప్రసాద్ మరి కొందరితో అడ్డుకొని కత్తితో బెదిరించి సెల్ ఫోన్ రూ 1 వెయ్యి నగదు దోచుకున్నారన్నారు. సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రొంపిచర్ల ఎస్.ఐ శివకష్ణ తో పాటు ఎస్.పి ఆదేశాల మేరకు రూరల్ సిఐ పి.రామకష్ణ, రూరల్ ఎస్.ఐ కిషోర్ ఆధ్వర్యంలో బందాలుగా ఏర్పడి నిందితులను అదుపులోకి తీసుకు న్నారు. క్రోసూరు, అచ్చంపేట, నరసరావుపేట పట్టణం, నరసరావుపేట మండలానికి చెందిన 6 యువకులు నేర ప్రవృత్తి కలిగిన భవాని ప్రసాద్ ఆధ్వర్యంలో నేరాలకు పాల్పడ్డారని పోలీసుల విచారణలో తేలిందన్నారు. 2 రోజుల క్రితం కూడా ఇదే మార్గంలో మరో వ్యక్తిని బెదిరించి నగదు సెల్ ఫోన్, శావల్యాపురం మండలం కొత్తలూరు గ్రామానికి చెందిన మహిళను కత్తితో బెదిరించి తాళిబొట్టు దొంగిలించినట్లు తేలిందన్నారు. వీరిలో ప్రధాన ముద్దాయి భవాని ప్రసాద్ పై మొత్తం 35 కేసులు ఉన్నట్లు జల్సాలకు అలవాటు పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారన్నారని వెల్లడించారు. 4 గురు నిందితులపై రౌడీ షీట్ ఓపెన్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నామని మరో ఇరువురు కోసం గాలిస్తున్నామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సిఐ రామకృష్ణ, ఎస్.ఐ లు శివకృష్ణ, కిషోర్‌లను అభినందిస్తున్నట్లు తెలిపారు.

ఫైర్ స్టేషన్‌లో యువకుడు హల్చల్

ప్రజాశక్తి తెనాలి

ఫైర్ స్టేషన్‌లో హల్చల్ చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ వన్ టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం కొత్తపేటలోని అగ్నిమాపక కేంద్రంలో బుధవారం రాత్రి ఓ యువకుడు హల్చల్ చేశాడు. భవన నిర్మాణం సందర్భంగా ప్రహరీ తొలగించి ఉండడంతో వెనుక నుండి లోనికి చొరబడిన యువకుడు అనుమానాస్పదంగా తిరగడం, ఫైర్ ఆఫీసర్ కుర్చీలో కూర్చొని అక్కడ గోడకు తగిలించి ఉన్న యూని ఫామ్ జేబులు వెతుకుతుండటాన్ని డ్యూటీ ఫైర్ మెన్ గుర్తించి పట్టుకుని ఒన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగిం చారు. యువకుడు పట్టణానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే యువకుడి మానసిక స్థితి సరిలేదని గుర్తించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' పోటీ విజేతల ప్రకటన

ప్రజాశక్తి - గుంటూరు

ఎపి ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యాన అమరావతి - గుంటూరు హైవేలోని శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీలో వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభ సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన 'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' పోటీల విజేతలను పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. విజేతలకు జనవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రపంచ తెలుగు మహాసభ ప్రధాన వేదికపై ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పోటీ సమన్వయకర్తగా కార్టూనిస్ట్ హరి వ్యవహరించినట్లు తెలిపారు. ఎంపికైన ఉత్తమ కార్టూన్లను మహాసభ ఆవరణలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రామ్ శేష (నెల్లూరు), ద్వితీయ బహుమతి సునీల్ (అమలాపురం), తతీయ బహుమతి సరసి (హైదరాబాద్)కు లభించినట్లు తెలిపారు. ప్రోత్సాహక బహుమతులు బొమ్మన్ (విజయవాడ), పర్శి నాయుడు (మన్యం జిల్లా), కోరాడ రాంబాబు (విశాఖపట్నం) పొందినట్లు పేర్కొన్నారు.